


మంత్రి నారా లోకేష్ చొరవతో ఏపీకి పారిశ్రామిక వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. రూ.26 లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణ, 24 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శుక్రవారం 13.11.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 202 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00



కార్పొరేట్ హోంగా ఆంధ్రప్రదేశ్

ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్‌కు వాస్తవ రూపం

పారిశ్రామికవేత్తలకు ఫోన్ కాల్ దూరంలో ఉంటాం / మీ టీమ్‌ల కంటే వేగంగా స్పందిస్తాం / పెట్టుబడుల రక్షణకు ప్రత్యేక చట్టం

సీఐఐ 31వ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో మంత్రి నారా లోకేష్

విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : గ్లోబల్ పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్ ను కేవలం సందర్శించడమే గాక ఇక్కడ పెట్టుబడి పెట్టండి, ఆవిష్కరించండి, ఎదగండి. ఇక్కడ కేవలం మీ ఫ్యాక్టరీలు మాత్రమే నిర్మించకండి. ఆంధ్రప్రదేశ్ ను మీ కార్పొరేట్ హోమ్ గా చేసుకోవాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్స్ లో సీఐఐ 31వ పార్టనర్ షిప్ సమ్మిట్ పారిశ్రామిక దిగ్గజాల కోలాహలం నడుమ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఈ సదస్సులో మనం ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్ గురించి మాట్లాడుతున్నాం. ఆంధ్రప్రదేశ్ లో, ఈ మూడు పదాలకు వాస్తవ రూపమిచ్చి పెట్టుబడులు, భాగస్వామ్యాలు, అవకాశాలుగా మార్చాలనుకుంటున్నాం. మా ప్రభుత్వ పూర్తి మద్దతు మీకు ఉంది. మా తలుపులు మీ కోసం ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి, మా టీమ్‌లు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటాయి. మీతో కలిసి పని చేయడానికి మేము ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ ను ఆస్వాదించండి. మీరు తిరిగి వెళ్ళేటప్పుడు జ్ఞాపకాల కంటే ఎక్కువ తీసుకెళ్లండి. ఇక్కడి నుంచి మీ భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఒక ప్రణాళికను తీసుకెళ్లండి. మా తరపున వంద శాతం మద్దతు మీకు ఉంటుంది. అని పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు.

మిగతా 2లో...



అరకు కాఫీకి అంతర్జాతీయ మార్కెట్!

- ఐదేశీ మార్కెట్ల కోసం కాఫీ సేకరించండి
- ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో గిరిజన కార్పొరేషన్‌తో భాగస్వామ్యం
- ప్రధాన నగరాలు, జాతీయ రహదారులపై లెవిస్టా కేఫ్‌లు 2లో
- ఎస్ఎల్ఎన్ కాఫీ సంస్థకు మంత్రి లోకేష్ ప్రతిపాదన



డ్వాక్రాకు గ్లోబల్ మార్కెట్



- ఏపీ ఉత్పత్తులకు ప్రపంచ విపణిలో చోటు
- వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్ సహా చైన్లలో చేర్చండి
- స్వయం, లేపాక్షి బ్రాండ్లకు ప్రాధాన్యం
- మహిళా సంఘాలు, కళాకారులకు చేయూత

2లో

ఏపీలో క్లీన్‌మాక్స్ భారీ ప్రాజెక్టులు



విద్యుత్ రంగంలో రూ.36 వేల కోట్ల పెట్టుబడులు

క్లీన్ మాక్స్ చైర్మన్ కుల్ దీప్‌తో మంత్రి లోకేష్ భేటీ

2లో

తొలిరోజే పెట్టుబడుల సునామీ



- ఏపీకి రూ.1,57,607 కోట్ల పెట్టుబడులు
- 35 ఒప్పందాలు.. 52,956 ఉద్యోగావకాశాలు
- మంత్రి లోకేష్ సమక్షంలో పారిశ్రామిక దిగ్గజాల అంగీకారం

3లో

రెన్యూ పెట్టుబడుల జోరు



- రాష్ట్రానికి మరో రూ.29,500 కోట్ల పెట్టుబడులు
- రెండు భారీ ప్రాజెక్టులకు ఒప్పందం
- పంప్డ్ స్టోరేజీ, గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ల ఏర్పాటు
- మరో రూ.11 వేల కోట్ల సిలికాన్ ప్రాజెక్టుకూ అంగీకారం

3లో



మహిళా శక్తికి మహా ప్రోత్సాహం

ఐదుగురు మహిళా పారిశ్రామికవేత్తలకు దావోస్‌లో అవకాశం

మహిళా శ్రామిక శక్తిని 50 శాతానికి పెంచుతాం

'ఉమెన్ అండ్ గ్రోత్' సదస్సులో సీఎం ప్రకటన

విశాఖపట్నం, నవంబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్) : మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లోనూ సమాన భాగస్వాములుగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మహిళల భాగస్వామ్యం రాజకీయ, ఆర్థిక రంగాల్లో 50 శాతానికి మించినప్పుడే తనకు సంపూర్ణ సంతృప్తి కలుగుతుందని అన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా టెక్ పార్క్ ఏర్పాటు చేసి, ఉచితంగా భూమితో పాటు అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా నిర్వహించిన 'ఉమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్'లో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. 'ది ఉమెన్ హూ విల్ షేప్ ది నెక్స్ట్ ఎకానమీ: లీడర్‌షిప్, క్యాపిటల్, అంబిషన్' అనే థీమ్‌తో జరిగిన ఈ సదస్సులో కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ, సీఐఐ ప్రతినిధులు, అలయన్స్ ఫర్ గ్లోబల్ గుడ్ సభ్యులు, పారిశ్రామికవేత్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు అవకాశాలిస్తే అద్భుత విజయాలు : మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తే వారు అద్భుతమైన విజయాలు సాధిస్తారని ముఖ్యమంత్రి అన్నారు. పుట్టుక నుంచే మహిళల పట్ల వివక్ష చూపే ధోరణి సమాజంలో ఉందని, కొడుకు కుటుంబంతోనే ఉంటాడని,

మిగతా 3లో...

కోకో సాగుకు మహర్దశ

- మోండెలేజ్‌తో కోకో మిషన్ ఏర్పాటుకు సీఎం ప్రతిపాదన
- ఏటా 10 వేల హెక్టార్లలో సాగు విస్తరణ
- నాణ్యమైన విత్తనాలు, శాస్త్రీయ సాగుకు ప్రోత్సాహం
- స్థానిక రైతుల నుంచే ముడిసరుకు సేకరణకు సూచన

3లో

జపాన్ పెట్టుబడులకు ఏపీ వేదిక

- అనంతపురం, విశాఖ వద్ద పారిశ్రామిక క్లస్టర్లపై ఆసక్తి
- శ్రీసిటీ తరహాలో కొత్త పారిశ్రామిక హబ్‌ల ఏర్పాటు
- పెట్టుబడులకు అనువైన బ్లూప్రింట్ల రూపకల్పన
- సీఎంతో భేటీలో జేఆర్ఐ చైర్మన్ వెల్లడి

3లో

కియాతో కొలువుల కోలాహలం



- రూ.18,811 కోట్ల భారీ పెట్టుబడి
- రెండో కార్ల ప్లాంట్ ఏర్పాటుకు ఒప్పందం
- 12 వేల మందికి ఉద్యోగాలు
- ఏపీ నుంచే ఈవీ, హైబ్రిడ్ కార్ల తయారీకి అడుగులు

విశాఖపట్నం, నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగ అభివృద్ధికి మరో భారీ ముందడుగు పడింది. దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ కియా సత్యసాయి జిల్లాలో తన కార్ల తయారీ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ముందుకు వచ్చింది. ప్రస్తుత పెనుకొండ ప్లాంట్‌కు అదనంగా ఎర్రమంచిలో ఏడాదికి 2 లక్షల వాహనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యంతో రెండో కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం కియా, దాని సరఫరా భాగస్వాములు సంయుక్తంగా 2 బిలియన్ అమెరికన్ డాలర్ల మేర భారతీయ కరెన్సీలో రూ.18,811 వేల కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనున్నాయి. ఈ విస్తరణ ద్వారా సుమారు 12 వేల మందికి అదనంగా ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఈ మేరకు విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ 31వ భాగస్వామ్య సదస్సు వేదికగా

మిగతా 2లో...

సెమీకండక్టర్ హబ్‌గా తిరుపతి



- సైయంట్ ప్రెసిడెంట్ నరసింహంతో మంత్రి నారా లోకేష్ సమావేశం

విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : సైయంట్ ప్రెసిడెంట్ & హెడ్ ఆఫ్ కార్పొరేట్ ఫంక్షన్స్ డాక్టర్ పీఎన్ఎస్వీ నరసింహంతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విశాఖపట్నంలో సమావేశమయ్యారు.

మిగతా 3లో...

హరిత ఇంధనానికి ఏపీ పెద్దపీట



- సౌదీ అరేబియా తరహాలో క్లీన్ ఎనర్జీ కేంద్రంగా రాష్ట్రం
- 2028 నాటికి రెట్టింపు కానున్న విద్యుత్ అవసరాలు
- సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు వేగం
- పరిశ్రమలకు విధానపరమైన స్థిరత్వం

విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని, క్లీన్ ఎనర్జీ రంగంలో సౌదీ అరేబియాలాగా ఏపీని తీర్చిదిద్దుతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా 'భారతదేశ ఇంధన భవిష్యత్ కు ఊతమివ్వడం: పునరుత్పాదక ఇంధన వనరులు, గ్రీన్ హైడ్రోజన్' అంశంపై జరిగిన ప్రత్యేక ఫ్లీనరీ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మోడరేటర్ గా ఈటీ సీనియర్ అసిస్టెంట్ ఎడిటర్ నిధి శర్మ వ్యవహరించారు.

మిగతా 3లో...

మీ కలకు.. ఏపీ భరోసా

- పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గొప్ప వేదిక
- గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోనూ పరిశ్రమలు పెట్టండి
- చిన్న పారిశ్రామికవేత్తలకూ అవకాశాలు
- వేగంగా అనుమతులు.. పెట్టుబడులకు పూర్తి భద్రత
- రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్): 'ఆంధ్రప్రదేశ్ అవకాశాల గని. పెట్టుబడిదారులు ఉన్నతమైన ఆలోచనలతో రాష్ట్రానికి రండి.. మీరు అత్యున్నతంగా ఎదుగుతారు. స్పష్టమైన విజన్‌తో పెట్టుబడులు పెట్టండి... రాష్ట్రం మీకు సొంతిల్లులా పని చేస్తుంది. భవిష్యత్తుపై భరోసాతో ధైర్యంగా పెట్టుబడులు పెట్టండి.. తక్కువ సమయంలో రాష్ట్ర కలను, మీ కలను నిజం చేసుకోండి' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు పూర్తిస్థాయి భద్రత,

మిగతా 2లో...

కార్పొరేట్ హోంగా ఆంధ్రప్రదేశ్



(మొదటి పేజీ తరువాయి)

ఇదీ మా బలం-మా ధైర్యం : మాకు వెయ్యి కిలోమీటర్లకు పైగా తీరప్రాంతం ఉంది. విశాఖపట్నం ప్రధాన పోర్టు, మా ఇతర పోర్టులు ఇప్పటికే సంవత్సరానికి సుమారు 10 కోట్ల టన్నుల కార్గోను నిర్వహిస్తున్నాయి. రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడలలో నాలుగు కొత్త గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు నిర్మాణంలో ఉన్నాయి, దీంతో ఈ సామర్థ్యం రెట్టింపు కాబోతోంది. ఈ వారంలో మీలో చాలా మంది మా కొత్త అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం, భోగాపురంలో దిగారు. ఈ ఎయిర్ పోర్టు ఆగస్టులో ప్రారంభమైంది. దీనికి 3,800 మీటర్ల రన్‌వే ఉంది, ఇది భారీ విమానాల కోసం నిర్మితమైంది. భారతదేశ విమానయాన మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో నిరంతరం మద్దతు ఇస్తున్న గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీకి, ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంలో కృషి చేసిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకి, ఈ కలను నిజం చేసిన జీఎంఆర్ కు నా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఐటి సిటీగా విశాఖపట్నం : భారతదేశంలోని దాదాపు 60 శాతం ఎయిర్ కండిషనర్లు ఏపీ శ్రీసిటీలో ఒకే చోట తయారవుతాయి. భారతదేశ సముద్ర ఆహార ఎగుమతుల్లో పరిమాణం ప్రకారం సుమారు మూడో వంతు మా తీరం నుంచే వస్తుంది. రొయ్యల ఎగుమతుల్లో సుమారు 80 శాతం మా ఫార్మ్‌ల నుంచే వస్తుంది. భారతదేశ కోకోలో 40 శాతానికి పైగా మేమే పండిస్తాం. దేశంలో పండే ఎండు మిర్చిలో 40 శాతానికి పైగా గుంటూరు ప్రాంతం నుంచే వస్తుంది, అందుకే మా ఆహారం ఘాటుగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ భారతదేశ ఫ్రూట్ బౌల్. దేశంలోనే పండ్ల ఉత్పత్తిలో అతిపెద్ద రాష్ట్రం ఏపీ, జాతీయ ఉత్పత్తిలో సుమారు 16 శాతం వాటా మాదే. చేపలు, గుడ్ల ఉత్పత్తిలో కూడా భారతదేశంలో మేమే మొదటి స్థానంలో ఉన్నాం. భారతదేశ ఎఫ్‌సీవీ పొగాకులో సగానికి పైగా ఆంధ్రప్రదేశ్ నుంచే వస్తుంది. మా ఫ్యాక్టరీలే మా సామర్థ్యానికి నిదర్శనం. 2019లో కియా అనంతపురంలో ఉత్పత్తి ప్రారంభించినప్పటి నుంచి ఆ ప్లాంట్ నుంచి దాదాపు 19 లక్షల కార్లు బయటకు వచ్చాయి, అవి 90కి పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇదే సమయంలో విశాఖపట్నం ఐటీ సిటీగా మారుతోంది. జనవరిలో ఇక్కడ కాగ్నిజెంట్ ప్రారంభమైంది, దాని శాశ్వత క్యాంపస్ సుమారు 25,000 మంది కోసం ప్రణాళిక రూపొందించారు. టీసీఎస్ కూడా ఇక్కడ ప్రారంభమైంది.

మేం వచ్చాక ఇండస్ట్రీ ఎకోసిస్టమ్ మారిపోయింది : మా ప్రభుత్వ హయాంలో ఇది రెండో పార్టనర్‌షిప్ సమ్మిట్. జూన్ 2024 నుంచి మాకు రూ. 22.6 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి హామీలు వచ్చాయని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ఇది చారిత్రాత్మకం, అపూర్వం. అంతకంటే ముఖ్యంగా, వాటిలో 73 శాతం, అంటే 12.7 లక్షల మందికి ఉపాధి కల్పించే రూ. 17.2 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు అనుమతులుగా మారాయి, 51 శాతం గ్రౌండ్ అయ్యాయి. 7.4 లక్షల మందికి ఉపాధి కల్పించే రూ. 5.9 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామిక ఎకోసిస్టమ్ మారిందనడానికి ఇది నిదర్శనం. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ శ్రీసిటీలో రూ. 5,000 కోట్ల ఫ్యాక్టరీని నిర్మిస్తోంది. విశాఖపట్నంలోనే గూగుల్ సంస్థ ఏఐ హబ్ లో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడుతోంది, గిగావాట్ స్థాయి డేటా సెంటర్ క్యాంపస్, అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ గేట్‌వేతో నిర్మితమవుతోంది. భారతదేశ చరిత్రలోనే ఇది అతిపెద్ద ఎఫ్‌డీఐ.

డిఫెన్స్ రంగంలో దూసుకుపోతున్న రేమాండ్స్ : ఈరోజు మూడు ప్రధాన కంపెనీల సక్సెస్ స్టోరీలో మేం ఎలా భాగమయ్యామో మీకు చెప్పాలనుకుంటున్నాను. నేను దీనిని ఫ్లిప్, స్కేల్, ఇంక్యుబేషన్ అని పిలుస్తాను. మొదటిది, ఫ్లిప్. తరతరాలుగా, ఒక కంపెనీ పేరు భారతదేశంలో ప్రముఖ బ్రాండ్ గా ఉంది. మీరు కొనగలిగే అత్యుత్తమ సూట్ ను ఆ కంపెనీ తయారు చేస్తుంది. తర్వాత ఇది ఇళ్లు కూడా నిర్మించింది. ఏరోస్పేస్, డిఫెన్స్ లోకి ఫ్లిప్ అవ్వాలని నిర్ణయించుకుంది. మేము వారికి భూమి, ప్రోత్సాహకాలు, ప్లగ్ అండ్ ప్లే మౌలిక సదుపాయాలు ఇచ్చాం. వారి ప్రాజెక్టులు, సుమారు రూ. 1,200 కోట్ల విలువైనవి, రాయలసీమలోని టేకులోడులో ఏరోస్పేస్ విడిభాగాలు, గుడిపల్లిలో ఆటో విడిభాగాలు, రాప్తాడులో అపెరల్ పార్క్ వరకు వారి ప్రాజెక్టులు విస్తరించి ఉన్నాయి. ఇది మా కొత్త ఏరోస్పేస్ పాలసీ కింద వచ్చిన మొదటి పెట్టుబడి. వారి శంకుస్థాపన గత ఏడాది ఇదే సదస్సులో జరిగింది. ఏడాదిలోపే, ఆంధ్రప్రదేశ్ లోని వారి తాత్కాలిక కేంద్రంలో 30కి పైగా మెషిన్లు ఏర్పాటు చేసి ట్రయల్ రన్ చేస్తున్నారు. అదే సమయంలో వారి ప్రధాన ప్లాంట్ కూడా నిర్మాణంలో ఉంది. ఆ కంపెనీ షేర్ ధర రెట్టింపు కంటే ఎక్కువైంది. ఆ కంపెనీ పేరు రేమాండ్. త్వరలో రేమాండ్ ఏరోస్పేస్, డిఫెన్స్ అండ్ ఇంజనీరింగ్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి.

అతిపెద్ద సోలార్ సెల్ తయారీదారుగా ప్రీమియర్ : రెండోది, స్కేల్. భారతదేశంలో స్థిరపడిన సోలార్ తయారీదారులలో ఒకరు ఒక విచిత్రమైన సమస్యను ఎదుర్కొన్నారు. దేశవ్యాప్తంగా సోలార్ ఆకాంక్షలు వేగంగా పెరుగుతున్నాయి, 2030 నాటికి భారత్ 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం సోలార్ సెల్స్ దిగుమతి చేసుకోవడం కాకుండా దేశంలోనే తయారుచేయాలని చెబుతోంది. వారు సెల్ సామర్థ్యాన్ని భారీ స్థాయిలో, వేగంగా నిర్మించాల్సి వచ్చింది. వారు 2025 ప్రారంభంలో మా దగ్గరకు వచ్చారు. మేము నాయుడుపేటలో ప్లగ్ అండ్ ప్లే మౌలిక సదుపాయాలు అందించాం. సుమారు 18 నెలల తర్వాత, వారు భారతదేశంలోనే అతిపెద్ద సోలార్ సెల్ తయారీ ప్లాంట్ ను ప్రారంభించారని చెప్పడానికి సంతోషిస్తున్నాను. 101 ఎకరాల్లో, రూ. 3,293 కోట్ల పెట్టుబడితో ఏడు గిగావాట్ల ఎన్-టైప్ టాప్‌కాన్ సెల్స్ తయారీ పరిశ్రమ అక్కడ ఏర్పాటు చేశారు. దీంతో ఆ కంపెనీ భారతదేశంలోనే అతిపెద్ద సోలార్ సెల్ తయారీదారుగా మారింది. ఈ కంపెనీ పేరు ప్రీమియర్ ఎనర్జీస్.

చిన్న కంపెనీ భారీ పరిశ్రమగా మారబోతోంది : మూడోది, ఇంక్యుబేషన్. మచిలీపట్నంలో ఎస్ఎస్‌డీ పాలిమర్స్ అనే ఎంఎస్ఎంఈ ఉంది. 30 ఏళ్లకు పైగా, ఇది అద్భుతమైన పనితీరు కనబర్చింది. రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి ఈఎంఐ షీల్డింగ్ కండక్టివ్ ఎలాస్టోమర్ గ్యాస్కెట్ల కోసం సీఈఎంఐఎల్ఏసీ టైప్ అప్రూవల్ పొందిన ఏకైక భారతీయ కంపెనీ ఇదే. వారి ఉత్పత్తులు భారతదేశం, విదేశాల్లో ఏరోస్పేస్, ఏవియేషన్, మెరైన్, నావల్ అప్లికేషన్లలో డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ లో ఉపయోగిస్తున్నారు. మేము అమరావతి క్వాంటం వ్యాలీని ప్రారంభించినప్పుడు, క్వాంటం కంపెనీల విడిభాగాలు తయారు చేయడానికి ఈ కంపెనీని భాగస్వామిని చేశారు. ఒక చిన్న పట్టణం నుంచి వచ్చిన ఆ చిన్న కంపెనీ, భవిష్యత్తులో పెద్ద కంపెనీగా అవతరించబోతోంది. అదే ఆంధ్రప్రదేశ్.

స్పీడ్..స్టెబిలిటీ..సర్వీస్..మా విధానం : ఆంధ్రప్రదేశ్ విధానంలో మొదటిది స్పీడ్. వ్యాపారం చేసే వేగం. రెండోది స్టెబిలిటీ: మా విధానాల స్థిరత్వం. మూడవది సర్వీస్. ప్రైవేట్ రంగంతో సమానమైన సేవ. ఒక ఉదాహరణ చెబుతాను. ఎస్క్రో ఖాతాల ద్వారా పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపును మేము ప్రారంభిస్తున్నాం. అంటే మేము మీకు వాగ్దానం చేసిన ప్రోత్సాహకమే మీకు నేరుగా అందుతుంది, దాని కోసం మీరు మా వెంట పడాల్సిన అవసరం లేదు. ఆచరణలో స్థిరత్వం అంటే ఇదే. మీరు మాతో పని చేసినప్పుడు, మీరు మా క్లయింట్. మేము అత్యున్నత ప్రమాణాల వృత్తి నైపుణ్యం, కస్టమర్ సర్వీస్ కు కట్టుబడి ఉంటాం. మీకు ఏదైనా సమస్య, సూచన, ఫీడ్‌బ్యాక్ ఉంటే నన్ను నేరుగా వాట్సాప్ లో సంప్రదించవచ్చు. నేను సమాధానం ఇస్తాను. కొన్నిసార్లు మీ సొంత టీమ్‌ల కంటే వేగంగా మేం వేగంగా స్పందిస్తాం.

ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురాబోతున్నాం : త్వరలోనే ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురాబోతున్నాం. కేంద్ర ప్రభుత్వం తో చర్చించి కేంద్ర స్థాయిలో కూడా ఇటువంటి యాక్ట్ అమలు అయ్యేలా చర్చలు జరుపుతాం. ఇటువంటి యాక్ట్ వలన పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి మరింత నమ్మకం ఏర్పడుతుంది.

ప్రధాన కార్యాలయాలను ఏపీకి తరలించండి! : మా వద్ద కేవలం ఫ్యాక్టరీ మాత్రమే నిర్మించకండి. మీ ప్రధాన కార్యాలయాన్ని ఏపీకి తరలించండి. ఎందుకంటే మొదటిది, మీరు జీవించే విధానం. స్వచ్ఛమైన గాలి, అందమైన తీరప్రాంతం, మీ నగరాల్లో మాదిరి ట్రాఫిక్ జామ్‌లు ఇక్కడ లేవు. రెండోది, ప్రతిభ. మా యువత ఆకాంక్షలతో పాటు నైపుణ్యంతో సిద్ధంగా ఉన్నారు. పరిశ్రమకు ఏమి అవసరమో దాని చుట్టూ మా కళాశాలలు, ఐటీఐలను మేం తీర్చిదిద్దుతున్నాం. మూడోది, కనెక్టివిటీ. ఒక ప్రధాన పోర్టు, నిర్మాణంలో మరో నాలుగు కొత్త పోర్టులు. గల్ఫ్, సింగపూర్ కు నేరుగా చేరే విమానాలతో భోగాపురంలో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చింది. నాలుగోది, భవిష్యత్తు ఇక్కడే నిర్మించబడుతోంది. గూగుల్ ఏఐ హబ్ విశాఖపట్నంలో వస్తోంది. మా రాజధాని అమరావతిలో ఐబీఎం.. టీసీఎస్, ఎల్ అండ్ టీ తో కలిసి క్వాంటం సిస్టమ్ టూల్‌ను ఏర్పాటు చేస్తోంది. 2027 ప్రారంభంలో కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఐదోది, యాక్సెస్. ఆంధ్రప్రదేశ్ లో మీరు సమావేశం కోసం నెలల తరబడి వేచి ఉండరు. మా ముఖ్యమంత్రి, మంత్రులు, నేను ఒక ఫోన్ కాల్ లేదా వాట్సాప్ సందేశం దూరంలోనే అందుబాటులో ఉంటామని మంత్రి లోకేష్ అన్నారు.

మీ కలకు.. ఏపీ భరోసా



(మొదటి పేజీ తరువాయి)

భరోసా ఇచ్చేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

విశాఖపట్నం వేదికగా రెండ్రోజుల పాటు జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు 58 దేశాల నుంచి 3,800 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్, ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పవన్ కల్యాణ్ ఈ సదస్సులో పాల్గొన్నారు. ముందుగా రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్.. పవన్ కల్యాణ్‌తో ప్రత్యేకంగా భేటీ అయి, సీఐఐ సదస్సు వేదికగా రాష్ట్రానికి రాబోతున్న పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన గురించి వివరించారు. అనంతరం సదస్సుకు హాజరైన పవన్ కల్యాణ్ అక్కడ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రితో కలిసి అరకు కాఫీ తాగారు. అనంతరం సదస్సులో ప్రసంగిస్తూ "ఆంధ్రప్రదేశ్ 1,053 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని కలిగి ఉన్న రాష్ట్రం. అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఆసియా దేశాలకు ముఖద్వారంగా రాష్ట్రం పనిచేస్తోంది. ఇక్కడ మానవ వనరులు, వినూత్న ఆలోచనలు, ప్రతిభ కలిగిన యువతకు కొదవ లేదు. పెట్టుబడిదారులు రాష్ట్రానికి వస్తే వారికి పూర్తిగా సహకరించేందుకు, వేగంగా అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది.

పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే ముందున్నాం : 1995లో సీఐఐ సదస్సులు ప్రారంభమైనప్పటి నుంచి ప్రభుత్వం, పారిశ్రామికవేత్తలు కలిసి ముందుకు సాగుతున్నాం. 2024లో జరిగిన సీఐఐ సదస్సులో 714 సంస్థలతో రూ. 22.6 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రంలో పెట్టేలా ఒప్పందాలు చేసుకున్నాం. వాటి ద్వారా 19.3 లక్షల ఉద్యోగాల కల్పనను లక్ష్యంగా చేసుకున్నాం. ఇటీవల కాకినాడలో జరిగిన సీఐఐ ప్రాంతీయ సదస్సులో 15 అవగాహన ఒప్పందాల ద్వారా రూ. 4,256 కోట్ల పెట్టుబడులు పెట్టేలా, 14 వేల ఉద్యోగాలు కల్పించేలా ఒప్పందాలు జరిగాయి. ప్రస్తుతం జరుగుతున్న 31వ సీఐఐ సదస్సులోనూ 150 అవగాహన ఒప్పందాలు, రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చేలా ప్రయత్నిస్తున్నాం. ఇది రాష్ట్రానికి ప్రగతి బాట. భవిష్యత్తు తరాలకు పూలబాట. దేశంలోనే రాష్ట్రం పెట్టుబడుల సాధనలో ముందుండటానికి స్థిరమైన ప్రభుత్వం, భవిష్యత్తుపై ఆశలు, ఆలోచనలే ప్రధానం. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా మేం తగిన విధంగా ముందుకు వెళ్తాం. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలు క్షేత్రస్థాయిలో వెంటనే తమ కార్యకలాపాలు మొదలుపెట్టేలా చొరవ తీసుకోవాలి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది. రాష్ట్ర గతిని మార్చేలా మీ ఆలోచనలు, భవిష్యత్తుకు పునాదులు ఉండాలి. కేవలం భారీ పెట్టుబడిదారులకే కాకుండా చిన్నస్థాయి ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులనూ ఇందులో భాగస్వామ్యం చేయాలి. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేవారికి అన్ని విధాలా సహకారం అందిస్తాం. అక్కడి ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. నేను పారిశ్రామికవేత్తలకు చెప్పేది ఒక్కటే... మా మానవ వనరులను నమ్మి పెట్టుబడులు పెట్టండి. ఉత్పత్తి కోసమే కాదు... వినూత్న ఆలోచనలను నమ్మి పెట్టుబడులు పెట్టండి. మీరు బాధ్యత తీసుకోండి.. పర్యావరణాన్ని, ప్రకృతిని నాశనం చేయకుండా ముందుకు సాగుతామని ప్రతినబూనండి" అని పవన్ కల్యాణ్ అన్నారు.

సదస్సులో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీ భరత్, సీఐఐ అధ్యక్షుడు ముకుందన్, సీఐఐ డిజిగ్నేట్ ప్రెసిడెంట్ సుచిత్రా ఎల్లా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కియాతో కొలువుల కోలాహలం



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వంతో కియా అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కియా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ గ్వాంగ్ లీ, కియా కార్పొరేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎయి చుల్ జెంగ్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది.

465 ఎకరాల్లో రెండో ప్లాంట్..2030 ప్రారంభంలో ఉత్పత్తి : ఉమ్మడి అనంతపురం జిల్లా పెనుకొండలో ప్రస్తుత కియా ప్లాంట్ పరిధిలోనే రెండో ప్లాంట్, అనుబంధ యూనిట్లను కలిపి మొత్తం 465 ఎకరాల్లో ఈ విస్తరణ చేపట్టనున్నారు. రెండో ప్లాంట్ లో ఏడాదికి మరో రెండు లక్షల వాహనాలు తయారు చేయాలని లక్ష్యంగా కియా నిర్దేశించుకుంది. 2030 ప్రారంభం నాటికి ఈ ప్లాంట్ నుంచి ఉత్పత్తి ప్రారంభించాలని కియా ప్రణాళిక రూపొందించింది. కొత్త ప్లాంట్‌లో ఐసీఈ, ఈవీ వాహనాలకు సంబంధించిన అధునాతన మోడళ్లను తయారు చేయనున్నారు. వాహన తయారీలో కీలకమైన స్టాంపింగ్, వెల్డింగ్, పెయింటింగ్, అసెంబ్లీ వంటి అన్ని ప్రధాన తయారీ ప్రక్రియలను ఈ ప్లాంట్‌లో చేపట్టనున్నారు. ప్రస్తుతం అనంతపురంలోని కియా ప్లాంట్ ఏడాదికి 4.30 లక్షల వాహనాలను ఉత్పత్తి చేస్తోంది. రెండో ప్లాంట్ ద్వారా ఏడాదికి 6.30 లక్షల వాహనాల తయారు చేయాలని కియా భావిస్తోంది. రెండు ప్లాంట్ల ద్వారా మొత్తం కియా పెట్టుబడులు దాదాపు 5 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరనున్నాయి. కొత్త ప్లాంట్ విస్తరణతో ఆటోమొబైల్ రంగంలో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

పెట్టుబడులకు రక్షణ కల్పిస్తాం : కియా సంస్థతో ఒప్పందం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కియా సంస్థ రాష్ట్రంలో మరో 2 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడితో ప్లాంట్ విస్తరణ చేపట్టడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై నమ్మకం ఉంచి మరోసారి భారీ పెట్టుబడులతో ముందుకు వచ్చిన కియా యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాలు, హైబ్రిడ్ కార్లు, ఆటోమొబైల్ విడిభాగాల తయారీలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దాలని కియా ప్రతినిధి బృందాన్ని కోరారు. కియా సంస్థకు డిజైన్ ఇంజనీరింగ్ సెంటర్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్, స్ట్రాటజిక్ బ్యాటరీ పరిశోధన, అభివృద్ధి కేంద్రాలను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని సూచించారు. బ్యాటరీ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ఐఐటీ తిరుపతి భాగస్వామ్యం వహించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. పారిశ్రామిక పెట్టుబడిదారులకు మరింత భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం పెట్టుబడిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఎస్క్రో ఖాతా విధానం ద్వారా ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. పెట్టుబడులకు రక్షణ కల్పించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను కూడా తీసుకువస్తున్నట్లు తెలిపారు. విదేశీ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ నమ్మకమైన భాగస్వామిగా నిలుస్తోందని, దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం రాష్ట్రానికి రావడం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. దక్షిణ కొరియా కంపెనీలు రాష్ట్రంలో యాంకర్ ఇండస్ట్రీస్ అంబాసిడర్లు గా నిలవాలని ఆకాంక్షించారు. ఏపీలో నైపుణ్యం కలిగిన యువతకు కొదవ లేదని, పరిశ్రమలు వారికి అవకాశాలు కల్పిస్తే రాష్ట్ర పారిశ్రామిక రంగం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. రెండో ప్లాంట్ విస్తరణ పనులను వేగవంతం చేసి 2029 మే నాటికే పూర్తి చేయాలని కియా యాజమాన్యాన్ని కోరారు.

కియా పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం : గతంలో కియా సంస్థను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడానికి విస్తృత ప్రయత్నాలు చేసినట్లు ముఖ్యమంత్రి గుర్తుచేశారు. అనంతపురం జిల్లాలో కియా ప్లాంట్ ఏర్పాటు చేస్తుందని అప్పట్లో ఎవరూ ఊహించలేదని, సంస్థ యాజమాన్యాన్ని ఒప్పించేందుకు స్వయంగా దక్షిణ కొరియాకు వెళ్లినట్లు తెలిపారు. ప్లాంట్‌కు అవసరమైన నీటి సౌకర్యం కోసం గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకువచ్చి సహకరించామని, జాతీయ రహదారి, బెంగళూరు విమానాశ్రయానికి అనుసంధాన సదుపాయాలు కల్పించామని చెప్పారు. కేవలం 14 నెలల్లోనే ప్లాంట్ నిర్మాణం పూర్తయ్యేలా ప్రభుత్వం సహకరించిందని, ఏపీలో తయారైన తొలి కియా కారును తానే ప్రారంభించినట్లు గుర్తుచేశారు. 2019 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో కార్ల ఉత్పత్తి ప్రారంభించిన కియా సంస్థ ప్రస్తుతం అనంతపురం జిల్లా పెనుకొండ ప్లాంట్ నుంచి 100కు పైగా దేశాలకు వాహనాలను ఎగుమతి చేస్తోంది. కియా ప్రస్తుత ప్లాంట్‌లో సెల్టోస్, సైరోస్, సోనెట్, కారెన్స్, కారెన్స్ క్లావిస్, కార్నివాల్, సోరెంటో వంటి మోడళ్లను ఉత్పత్తి చేస్తోంది. తాజా విస్తరణతో అధునాతన వాహనాల తయారీ, ఎగుమతులు, అనుబంధ పరిశ్రమల అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ మరింత కీలక పాత్ర పోషించనుంది.


డ్వాక్రాకు గ్లోబల్ మార్కెట్



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : వాల్‌మార్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ గవర్నమెంట్ అఫైర్స్ & బిజినెస్ డిప్లొమసీ) పాల్ డైక్ తో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విశాఖపట్నంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ సముద్ర ఆహారం, వస్త్రవ్యాపారంలో బలమైన భాగస్వామ్యాలు, పెట్టుబడులను అన్వేషించడానికి ఏపీలో జరిగే ఎంఎస్ఎంఈ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ కొనుగోలుదారులను ఏపీకి తీసుకురావాల్సిందిగా కోరారు. గతంలో న్యూఢిల్లీలో జరిగిన వాల్‌మార్ట్ గ్రోత్ సమ్మిట్ భారతదేశానికి చెందిన సరఫరాదారులు, వ్యవస్థాపకులు తమ ఉత్పత్తులను వాల్‌మార్ట్ గ్లోబల్ కొనుగోలుదారులకు పరిచయం చేయడానికి సహాయపడిందని గుర్తుచేశారు. స్వయం ఏపీ, లేపాక్షి బ్రాండ్ల కింద స్థానిక కళాకారులు, మహిళలు నడిపే ఎస్‌హెచ్‌జీలను వాల్‌మార్ట్, ఫ్లిప్ కార్ట్ దేశీయ, ప్రపంచ సప్లై చైన్‌లలోకి ప్రత్యేకంగా చేర్చడానికి మార్గాన్ని సులభతరం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.


వాల్ మార్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పాల్ డైక్ స్పందిస్తూ... ఏపీ రొయ్యల అతిపెద్ద కొనుగోలుదారులలో వాల్ మార్ట్ ఒకటిగా ఉంది, సంవత్సరానికి 6.5 కోట్ల పౌండ్లకు పైగా రొయ్యలను తమ సంస్థ కొనుగోలు చేస్తోంది, దీనితో పాటు రాష్ట్రం నుంచి ఫార్మా, వస్త్రాలు, ఇంజనీరింగ్ వస్తువులు కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ఏపీలో ఫ్లిప్ కార్ట్ ఇప్పటికే పెట్టిన పెట్టుబడుల వల్ల 28,000కు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ-ఉపాధి అవకాశాలు లభించాయి. సుమారు 12 లక్షల చదరపు అడుగుల మౌలిక సదుపాయాల స్థలం, 0.33 మిలియన్ చదరపు అడుగుల హోల్‌సేల్ స్థలంతో రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా లాజిస్టిక్స్ హబ్‌ల ద్వారా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)తో ఎంవోయూ మేరకు ఏపీలో 3,200కు పైగా ఎంఎస్ఎంఈలకు శిక్షణ ఇచ్చాం, వాటిలో 900కు పైగా ఫ్లిప్‌కార్ట్, వాల్‌మార్ట్ మార్కెట్‌ప్లేస్‌లో చేర్చామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని పాల్ డైక్ చెప్పారు.

అరకు కాఫీకి అంతర్జాతీయ మార్కెట్!



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : ఎల్ఎల్ ఎన్ కాఫీ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. శతప్పన్ తో విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విశాఖపట్నంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... మిడిల్ ఈస్ట్, యూరప్, ఆగ్నేయాసియా, రష్యాతో సహ కీలక అంతర్జాతీయ మార్కెట్లకు ప్రీమియం అరకు కాఫీని సేకరించాల్సిందిగా కోరారు. అరకు కాఫీ ప్రాసెసింగ్, మార్కెటింగ్, పంపిణీ కోసం ఆంధ్రప్రదేశ్ గిరిజన కార్పొరేషన్ తో కలిసి పనిచేయాలని కోరారు. హైవే వెంట ఉన్న వేసైడ్ సౌకర్యాలు, ప్రధాన పట్టణ కేంద్రాల్లో ఎస్ఎల్ఎన్ కాఫీ అనుబంధ సంస్థ లెవిస్టా కేఫ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. విశాఖపట్నం, విజయవాడ, అమరావతి, తిరుపతి పరిసరాలు ఇందుకు అనువుగా ఉంటాయని చెప్పారు. ఎస్ఎల్ ఎన్ కాఫీ చైర్మన్ శతప్పన్ మాట్లాడుతూ... ఎస్ఎల్ఎన్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ కాఫీ కోసం తన సొంత ఇంటిగ్రేటెడ్ తయారీ, ప్రాసెసింగ్, క్యూరింగ్ యూనిట్లను నిర్వహిస్తోంది. తమ సంస్థ సంవత్సరానికి 30వేల నుంచి 50వేల మెట్రిక్ టన్నుల (ఎంటీ) వరకు క్యూరింగ్, గ్రీన్ బీన్ ట్రేడింగ్ సామర్థ్యం కలిగి ఉందని చెప్పారు. ఎస్ఎల్ఎన్ కాఫీ మొత్తం ఆదాయంలో 80% పైగా మిడిల్ ఈస్ట్, యూరప్, ఆగ్నేయాసియా, రష్యా, సీఐఎస్ ప్రాంతాల నుంచి వస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని శతప్పన్ అన్నారు.

ఏపీలో క్లీన్‌మాక్స్ భారీ ప్రాజెక్టులు



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : క్లీన్ మాక్స్ సంస్థ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ కుల్ దీప్ జైన్ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. మంత్రి లోకేష్ తో చర్చల అనంతరం ఆంధ్రప్రదేశ్ లో భారీ పెట్టుబడులకు క్లీన్ మాక్స్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. రూ. 36,000 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక ఇంధన, విద్యుత్ పంపిణీ, పంప్డ్ స్టోరేజ్, డేటా సెంటర్ పార్క్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. 4 జీడబ్ల్యూ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై రూ. 28వేల కోట్లు (3 జీడబ్ల్యూ విండ్, 1 జీడబ్ల్యూ సోలార్), పునరుత్పాదక వనరులు సమృద్ధిగా ఉన్న టైర్-2 నగరంలో సొంత విద్యుత్ పంపిణీతో 1 జీడబ్ల్యూ (ఐటీ లోడ్) డేటా-సెంటర్ పార్క్‌పై సుమారు రూ. 2,000 కోట్లు, 1 జీడబ్ల్యూ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపై రూ. 6,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ చైర్మన్ కుల్ దీప్ జైన్ వెల్లడించారు. తమ సంస్థ ఆధ్వర్యాన ఇప్పటికే శ్రీ సత్యసాయి జిల్లా, పరిగి మండలం, బీచిగానిపల్లె, పరిసర గ్రామాల్లో రూ. 1,200 కోట్లతో 200 మెగావాట్ల సోలార్ పార్క్ భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ లో 2029 నాటికి 25 జీడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) సామర్థ్యానికి అనుగుణంగా క్లీన్ మాక్స్ విండ్-సోలార్ హైబ్రిడ్ లో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్)ను అనుసంధానం చేయాలని కోరారు.

ఏపీ పెవిలియన్, ఎంఎస్ఎంఈ ప్రదర్శనను వీక్షించిన మంత్రి లోకేష్

విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ప్లీనరీ హాల్ లో ఏర్పాటుచేసిన ఏపీ పెవిలియన్, ఎంఎస్ఎంఈ ప్రదర్శనను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వీక్షించారు.

ఈ సందర్భంగా ఏపీ సాంస్కృతిక, కళారంగ వైభవాన్ని చాటిచెప్పేలా ఏర్పాటుచేసిన వివిధ స్టాళ్లను మంత్రి సందర్శించారు. అరకు కాఫీ రుచి చూశారు.

రాజధాని అమరావతి టవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తిరుపతి, విశాఖపట్టణం, అమరావతి ఎకనామిక్ రీజియన్లలో చేస్తున్న అభివృద్ధిని ఈ సందర్భంగా అధికారులు వివరించారు.

ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, రాజ్యసభ ఎంపీ భాష్యం ప్రవీణ్, మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రెన్యూ పెట్టుబడుల జోరు



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : రెన్యూ ఛైర్మన్ & సీఈవో సుమంత్ సిన్హాతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విశాఖపట్నంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... రెన్యూ సంస్థ రాష్ట్రంలో పలుచోట్ల రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడంపై అభినందనలు తెలిపారు. మంత్రి లోకేష్ తో చర్చల అనంతరం మరో రెండు భారీ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేందుకు సుమంత్ సిన్హా సుముఖత వ్యక్తంచేశారు. మంత్రి నారా లోకేష్ సమక్షంలో రెన్యూ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు మధ్య ఒప్పందం జరిగింది. రాష్ట్రంలో కొత్తగా 2గిగావాట్ల పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టులో రూ. 12,500 కోట్లు, గ్రీన్ అమ్మోనియా/ఈ-ఫ్యూయల్ ప్రాజెక్టులో రూ. 17,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించారు. మంత్రి లోకేష్ స్పందిస్తూ... మరో రూ. 11వేల కోట్ల విలువైన పాలి సిలికాన్, మెటలర్జికల్ గ్రేడ్ సిలికాన్ ప్రాజెక్టు సైతం ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయ అంగీకారం తెలిపినందుకు అభినందనలు తెలియజేస్తూ... ప్రాజెక్టులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయా ప్రాజెక్టుల గ్రౌండింగ్ కు అవసరమైన పూర్తి సహాయ, సహకారాలను ఏపీ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ సహకారంతో తిరుపతి ఐఐటీలో ఏర్పాటు చేయబోయే సోలార్ సెల్ ప్రోటోటైపింగ్ కేంద్రం ఏర్పాటులో భాగస్వామ్యం వహించాల్సిందిగా మంత్రి లోకేష్ కోరారు.

రెన్యూ సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా మాట్లాడుతూ... తమ సంస్థ ఏపీలో 2015 నుంచే వివిధ ప్రాజెక్టులను నిర్వహిస్తోందని చెప్పారు. 2015లో మొదటి 24 మెగావాట్ల విండ్ ప్రాజెక్ట్ కళ్యాణదుర్గంలో ఏర్పాటుచేశామని, ప్రస్తుతం 10 ప్రాంతాల్లో 717 మెగావాట్ల విండ్, 60 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంతకల్లులో రూ. 22,000 కోట్లతో భారతదేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ పునరుత్పాదక ప్రాజెక్ట్ నిర్మిస్తున్నాం. ఇందులో 1.8 జీడబ్ల్యూ సోలార్, 1 జీడబ్ల్యూ విండ్, 2 జీడబ్ల్యూహెచ్ బ్యాటరీ స్టోరేజ్ అంతర్భాగాలుగా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా మాకవారిపాలెంలో రెన్యూ సంస్థ ఆధ్వర్యాన రూ. 85,200 కోట్ల విలువైన 1,000 మెగావాట్ల గ్రీన్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఆగస్టులో ఎస్ఐపీబి ఆమోదం లభించింది. రాంబిల్లిలో రూ. 4,200 కోట్ల విలువైన 6.5 జీడబ్ల్యూ ఇంగాట్-వేఫర్ ప్లాంట్ కు ఆగస్టులో శంకుస్థాపన చేశాం. మరో 2 జీడబ్ల్యూ పంప్డ్ స్టోరేజ్, 300 కేటీపీఏ గ్రీన్-అమ్మోనియా ప్లాంట్, 5 జీడబ్ల్యూ హైబ్రిడ్ ప్రాజెక్టులు ఉన్నాయని చెప్పారు.

మహిళా శక్తికి మహా ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

కూతురికి పెళ్లి చేసి పంపించేస్తామనే ఆలోచన మారాలని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థంగా నడిపించడం మహిళా సామర్థ్యానికి నిదర్శనమన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. స్థానిక సంస్థల్లో 50 శాతం మహిళలకు ప్రాతినిధ్యం కల్పించామని, అత్యంత విద్యావంతులైన మహిళలకు మేయర్లు, ఛైర్‌పర్సన్లు, జెడ్పీ ఛైర్‌పర్సన్లుగా అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఐదు స్థానాలు మహిళలకు లభించినప్పటికీ, తాము ఎనిమిది మంది మహిళలకు మేయర్లుగా అవకాశం కల్పించామని చెప్పారు. విశాఖ మేయర్ కూడా మహిళేనని గుర్తుచేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా అన్ని రాజకీయ పార్టీలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ అవకాశాలు కల్పించి, అందరూ అభివృద్ధి చెందాలన్నదే తన సంకల్పమని స్పష్టం చేశారు.

డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శం : ఆంధ్రప్రదేశ్‌లో మహిళా స్వయం సహాయక సంఘాలు సాధించిన విజయాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో 1.13 కోట్ల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల సభ్యులుగా ఉన్నారని, ఈ సంఘాల వద్ద రూ. 30 వేల కోట్ల కార్పస్ ఫండ్ ఉందని తెలిపారు. ప్రస్తుతం ఈ సంఘాలు దాదాపు రూ. లక్ష కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని వెల్లడించారు. డ్వాక్రా మహిళలు తాము తీసుకున్న రుణాల్లో 99.6 శాతం తిరిగి చెల్లిస్తున్నారని, మహిళలకు ఆర్థిక క్రమశిక్షణ, వ్యాపార నిర్వహణ సామర్థ్యం ఎంతగా ఉన్నాయో ఇది తెలియజేస్తోందన్నారు. మహిళల వద్ద రూ. 10 ఉంటే దానిని రూ. 100గా మార్చగల వ్యాపార నైపుణ్యం వారిలో ఉందని వ్యాఖ్యానించారు. స్వయం ఏపీ బ్రాండ్‌తో మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. మహిళలు కేవలం స్వయం ఉపాధికే పరిమితం కాకుండా, పెద్దఎత్తున పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మహిళా శ్రామిక శక్తి 35.8 శాతంగా ఉందని, దీనిని త్వరలోనే 50 శాతానికి తీసుకెళ్లడమే లక్ష్యమని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్రానికి వస్తున్న భారీ పెట్టుబడులు మహిళలకు విస్తృతంగా ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని చెప్పారు. విశాఖలోని బ్రాండెక్స్ దుస్తుల తయారీ కేంద్రంలో 20 వేల మంది మహిళలు పనిచేస్తున్నారని, గ్లోబల్ టాయ్ పార్క్ ద్వారా మహిళలకు 30 వేల ఉద్యోగాలు కల్పించే అవకాశాలున్నాయని తెలిపారు. కుప్పం, అనంతపురం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు పెట్టుబడులు వస్తున్నాయని, ఈ పరిశ్రమల్లో మహిళలకు అధిక సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. మహిళలకు ఆర్థిక భద్రత కల్పించడంలో ఆస్తి హక్కులు కీలకమని పేర్కొన్నారు. ఇటీవల విశాఖపట్నం, విజయవాడ, మంగళగిరిలో సుమారు రూ. 50 వేల కోట్ల విలువైన 60 వేల ఇళ్ల పట్టాలను అందించామని తెలిపారు. మహిళల పేరుతో ఆస్తులు ఉంటే వాటిని భద్రంగా కాపాడుకుంటారనే నమ్మకం ఉందని, ఇది వారికి సామాజిక భద్రతను కూడా కల్పిస్తుందని చెప్పారు.

సమాజంలో అసమానతలు రూపుమాపాలి : సమాజంలో పేదరికం, ఆర్థిక అసమానతలను తొలగించేందుకు పీ4, పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. సమాజంలో సంపన్నులుగా ఉన్న 10 శాతం మంది అత్యల్ప ఆదాయ వర్గాల్లోని 20 శాతం కుటుంబాలకు అండగా నిలవాలన్నదే ఎంబీకే విధానం లక్ష్యమని వివరించారు. కేవలం సంక్షేమ పథకాలతో పేదరికాన్ని నిర్మూలించలేమని, పేద కుటుంబాల ఆదాయ మార్గాలను పెంచి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని అన్నారు. లేదంటే పేదరికం శాశ్వతంగా కొనసాగుతుందని, సంపన్నులు మరింత సంపన్నులుగా, పేదలు మరింత పేదలుగా మిగిలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పేదరికం పెరిగితే సమాజంలో అనేక విపరిణామాలు చోటుచేసుకుంటాయని, యూరోపియన్ దేశాల్లో ప్రస్తుతం కనిపిస్తున్న పరిణామాలు దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదరికంలో ఉన్న కోటి 10 లక్షల కుటుంబాల అభ్యున్నతికి, ముఖ్యంగా మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదని, కార్పొరేట్ సంస్థలు పీ4 కార్యక్రమంలో భాగస్వాములై బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమాజం నుంచి ప్రయోజనం పొందినవారు తిరిగి సమాజానికి సేవ చేసేలా మహిళలు కూడా ఆదర్శంగా నిలవాలని సూచించారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు దావోస్‌లో అవకాశం : మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు అందిస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. వచ్చే దావోస్ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదుగురు మహిళా పారిశ్రామికవేత్తలు హాజరయ్యేలా ప్రభుత్వం సహకరిస్తుందని ప్రకటించారు. రాష్ట్రంలో 54 చేనేత క్లస్టర్లు ఉన్నాయని, వీటిలో అనేక క్లస్టర్లు మహిళా సంఘాల నేతృత్వంలో పనిచేస్తున్నాయని చెప్పారు. మహిళా పారిశ్రామికవేత్తలు మరింతగా ఎదిగేందుకు అవసరమైన అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అటు ప్రకృతి వ్యవసాయంలోనూ మహిళలు అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. రైతులకు శిక్షణ ఇవ్వడం నుంచి ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించడం వరకు మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 25 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం జరుగుతోందని వెల్లడించారు. కుప్పంలో ఇటుకల తయారీ కేంద్రంలో కార్మికురాలిగా పనిచేసిన ఒక మహిళ, తన కష్టం...తెలివితేటలతో అదే సంస్థకు యజమానిగా ఎదిగారని ఉదాహరించారు. ప్రస్తుతం ఆమె ఏడాదికి రూ. 25 లక్షల ఆదాయం సంపాదిస్తున్నారని తెలిపారు. సరైన అవకాశాలు, శిక్షణ, ప్రోత్సాహం అందిస్తే మహిళలు ఎంతటి విజయాలైనా సాధించగలరని ఈ ఉదంతం నిరూపిస్తోందన్నారు.

మహిళలు టెక్నాలజీని వినియోగించుకోవాలి : మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుకు రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. గతంలో ఐటీ గురించి ఎక్కువగా మాట్లాడేవాడినని, ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి ఎక్కువగా ప్రస్తావిస్తున్నానని చెప్పారు. డేటా సెంటర్లు, క్వాంటం టెక్నాలజీ, స్పేస్, డ్రోన్లు, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల రంగాల్లో ఆంధ్రప్రదేశ్ అద్భుతమైన పురోగతి సాధించే దిశగా అడుగులు వేస్తోందన్నారు. తిరుపతిని సెమీకండక్టర్ల తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని, గ్లోబల్ డిజైన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో యుద్ధాల్లో డ్రోన్లు, రోబోటిక్స్ కీలక పాత్ర పోషిస్తాయని, కర్నూలులో తయారైన డ్రోన్‌ను ఆపరేషన్ సిందూర్‌లోనూ వినియోగించారని గుర్తుచేశారు. స్కైరూట్ వంటి సంస్థలు ఆధునిక సాంకేతికతతో సాధ్యమయ్యే విజయాలను నిరూపిస్తున్నాయని అన్నారు. మహిళలు కూడా సాంకేతిక రంగాలపై దృష్టి సారించి, అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అలాగే, రాష్ట్రంలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.



సీఎం చంద్రబాబు ప్రోత్సాహమే భారత్ బయోటెక్‌కు పునాది : సుచిత్ర

సదస్సులో మాట్లాడిన సీఐఐ ప్రెసిడెంట్ సుచిత్రా ఎల్లా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వాన్ని ప్రశంసించారు. హైదరాబాద్‌కు ఐటీ రంగాన్ని తీసుకురావడంలో, ఆంధ్రప్రదేశ్‌ను బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ముందంజలో నిలపడంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించారని అన్నారు. 1996లో హైదరాబాద్‌లో భారత్ బయోటెక్ సంస్థను స్థాపించడానికి చంద్రబాబు అందించిన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం ఎంతో ఉపయోగపడ్డాయని గుర్తుచేశారు. కరోనా సమయంలో కోట్లాది మంది ప్రాణాలను కాపాడటంలో భారత్ బయోటెక్ వ్యాక్సిన్లు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. భారతదేశ అభివృద్ధిలో మహిళలు ముందుండాలని, వారు కేవలం ఉద్యోగులుగా కాకుండా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళలు దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళల పరివర్తన, సాధికారత మరింత వేగంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు మూలధనం, మార్కెట్ అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు, నాయకత్వ శిక్షణ అందించడం ద్వారా భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను నిర్మించే శక్తిగా వారిని తీర్చిదిద్దాలన్న అంశంపై సదస్సులో చర్చించారు.

సెమీకండక్టర్ హబ్‌గా తిరుపతి



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... తిరుపతిలో సెమీకండక్టర్ పార్క్ అభివృద్ధికి జాయింట్ డెవలప్ మెంట్ మోడల్ ను పరిశీలించాలని కోరారు. సుమారు 200 ఎకరాల్లో సెమికాన్ పార్కు అభివృద్ధికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. సైయంట్ ఫౌండేషన్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) మధ్య గత ఏడాది జూన్ లో కుదిరిన ఎంవోయూ, తదనంతర పురోగతిపై చర్చించారు. సైయంట్ ప్రెసిడెంట్ నరసింహం మాట్లాడుతూ... ప్రస్తుతం విశాఖపట్నం (రుషికొండ), కాకినాడలలో సైయంట్ లిమిటెడ్ ఐటీ, ఇంజనీరింగ్ ఎస్ఈజెడ్ క్యాంపస్‌లు పనిచేస్తున్నాయని చెప్పారు. జూన్ 2025లో అమరావతిలో కుదిరిన ఒప్పందం మేరకు విశాఖపట్నంలో సిటీ ఇన్నోవేషన్ క్లస్టర్ ను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అని చెప్పారు. పైలట్ క్లస్టర్ లో 43 ఉన్నత విద్యా సంస్థలు, 270కు పైగా పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. జాయింట్ డెవలప్ మెంట్ మోడల్ లో తిరుపతిలో సెమికాన్ పార్క్ అభివృద్ధికి నరసింహం సుముఖత వ్యక్తం చేశారు.

జపాన్ పెట్టుబడులకు ఏపీ వేదిక



విశాఖ, నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ లో జపాన్ ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటుకు ఆ దేశ కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయని జపాన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్ కెంజీ హిరమత్సు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. అనంతపురం లేదా విశాఖ వద్ద ఈ పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేసేందుకు తమ కంపెనీలు ముందుకు వస్తాయని వెల్లడించారు. ప్రస్తుతం ఇండియన్ కౌన్సిల్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రీసెర్చితో కలిసి జేఆర్ఐ పనిచేస్తోందని తెలిపారు. వాణిజ్యం లాజిస్టిక్స్ రంగాల్లో జపాన్ - ఇండియా వ్యూహాత్మక ఆర్థిక భాగస్వామ్యం కలిగి ఉన్నాయని వివరించారు. వంద బిలియన్ డాలర్ల విలువైన ఢిల్లీ- ముంబై ఇండస్ట్రియల్ కారిడార్ లో జపాన్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ చొరవతోనే జపాన్ కంపెనీలు పెట్టుబడులు పెడుతున్నట్టు సీఎంకు తెలిపారు. ఏపీలో విజయవంతమైన శ్రీసిటీ సెజ్ మోడల్ లోనే పారిశ్రామిక క్లస్టర్ ను ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నట్టు కెంజీ స్పష్టం చేశారు. మారిటైమ్ అభివృద్ధిలో భాగంగా షిప్ బిల్డింగ్ క్లస్టర్ల లాంటి మౌలిక సదుపాయాల కల్పనలోనూ ఆసక్తిగా ఉన్నట్టు వివరించారు. ఇన్వెస్టర్ రెడీ ఇండస్ట్రియల్ బ్లూ ప్రింట్స్ రూపకల్పనలో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు జేఆర్ఐ సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. త్వరలోనే అమరావతిలో ఏపీ- జపాన్ బిజినెస్ సమ్మిట్ ను ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్న్నట్టు కెంజీ హిరమిత్సు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం జపాన్ భాగస్వామ్యంతో కలిసి పనిచేసేందుకు ఏపీ సిద్ధంగా ఉందని.. రాష్ట్రంలోని అవకాశాలు, వనరులను అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

కోకో సాగుకు మహర్దశ

విశాఖపట్టణం, నవంబర్ 12 విశాఖపట్నం : రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి, వ్యవసాయ రంగాన్ని పరిశ్రమలతో అనుసంధానించడానికి ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. విశాఖపట్టణంలో గురువారం ప్రారంభమైన రెండు రోజుల సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా ప్రముఖ గ్లోబల్ స్నాకింగ్ దిగ్గజం మోండెలేజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెండ్ సంస్థ అధ్యక్షుడు సమీర్ జైన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో సమావేశమైంది. శ్రీసిటీలోని మోండెలేజ్ ప్లాంట్ విస్తరణ, రాష్ట్రంలో కోకో సాగు ప్రోత్సాహం, స్థానిక ఉపాధి కల్పనపై చర్చించారు. శ్రీసిటీలో మోండెలేజ్ సంస్థకు చెందిన చాక్లెట్ తయారీ యూనిట్ విస్తరణకు సంబంధించి గతంలో తీసుకున్న నిర్ణయాలు... వాటిని మరింత ముందుకు తీసుకెళ్లే అంశాలు వీరి సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. రూ. 1,800 కోట్ల పెట్టుబడితో చాక్లెట్ యూనిట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 90 శాతం పెంచే ప్రక్రియపై పనులు జరుగుతున్నాయని... ఈ విస్తరణ పనులు పూర్తయితే శ్రీసిటీలోని ప్లాంట్ ప్రపంచంలోనే అతిపెద్ద చాక్లెట్ తయారీ కేంద్రాలలో ఒకటిగా నిలుస్తుందని సంస్థ ప్రతినిధులు సీఎం



చంద్రబాబుకు వివరించారు. దీని కోసం అవసరమైన సహకారాన్ని, మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం తరపున అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. రాష్ట్రంలో విరివిగా పండుతున్న కోకో పంటకు ప్రోత్సాహం ఇవ్వటం ద్వారా రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. మోండెలేజ్ సంస్థ తన ఉత్పత్తులకు కావలసిన ముడిసరుకుల స్థానికంగానే సమకూర్చుకోవాలని సీఎం సూచించారు. ఉత్పత్తులకు అవసరమైన వాటిని స్థానికంగా సేకరించుకుంటే... ఆ మేరకు ఆయా ప్రాంతాల్లోని రైతులు, డ్వాక్రా మహిళలకు మరింత ఆదాయం లభిస్తుందని ఆ సంస్థ ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు. కోకో, పాడి ఉత్పత్తులు, ప్యాకేజింగ్ మెటీరియల్‌ను రాష్ట్రంలోని తయారీదారుల నుంచే సేకరించాలని, ముఖ్యంగా ప్యాకేజింగ్ పరిశ్రమల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు స్థానికులకు ఎక్కువగా ఇచ్చేలా చూడాలని కోరారు. రాష్ట్రంలోని స్థానిక రైతులు, పొదుపు సంఘాల మహిళలను నేరుగా తమ సప్లై చైన్‌లోకి అనుసంధానించి, పాలు, చక్కెర సహా వివిధ వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా సేకరించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా తాము స్థానిక యువతకు ఇస్తున్న స్కిల్ ట్రైనింగ్ వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు ఆ సంస్థ ప్రతినిధులు. మోండెలేజ్ సంస్థ చేపడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను సీఎం అభినందించారు. స్థానిక పారిశ్రామిక అవసరాలకు మానవ వనరుల సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు.

రాష్ట్రంలో కోకో సాగును బహుళ ప్రయోజనకరంగా మార్చేందుకు మోండెలేజ్ భాగస్వామ్యంతో కోకో మిషన్ ప్రారంభిస్తామని.. దానికి సహకరించాలని సీఎం ప్రతిపాదించారు. దీని ద్వారా ప్రతి ఏటా 10,000 హెక్టార్లలో కోకో సాగును విస్తరించి, 2040నాటికి 50,000 మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకోవాలని పేర్కొన్నారు. శాస్త్రీయ పద్ధతుల్లో నాణ్యమైన కోకో సాగును ప్రోత్సహించడానికి తిరుపతిలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో కోకో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ -ఆర్ అండ్ డి హబ్ ని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పాలిక్లోనల్ గార్డెన్స్ అభివృద్ధి, నాణ్యమైన విత్తనాలు, పరిశోధనలు పెంపొందించడం ద్వారా రైతులకు అధిక ఆదాయం సమకూరుతుందని తెలిపారు.

తొలిరోజే పెట్టుబడుల సునామీ



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : సీఐఐ 31వ భాగస్వామ్య సదస్సు తొలిరోజు రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయి. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఇన్వెస్టర్లు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారు. 30 ఎంఓయులు, 5 జీఓల ద్వారా రూ. 1,57,607 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఏపి ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలోని యువతకు 52,956 ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయి. రెన్యువబుల్ ఎనర్జీ, ఇన్ ఫ్రా, ఏరో స్పేస్, హెల్త్ కేర్, టూరిజం రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. మెగా ఇంజనీరింగ్ సంస్థ 3 ఎంఓయుల ద్వారా రూ. 39,400 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల ద్వారా 12,940 ఉద్యోగావకాశాలు రానున్నాయి. రష్మీ మెటలర్జికల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 18,500 కోట్లు, క్లీన్ మ్యాక్స్ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రూ. 41వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చాయి. యునైటెడ్ టెలికం లిమిటెడ్ రూ. 9,053 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.

హరిత ఇంధనానికి ఏపీ పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్లీన్ ఎనర్జీలో రంగంలో ఆంధ్రప్రదేశ్ ను సౌదీ అరేబియాలాగా తీర్చిదిద్దాలనేది నా ఆకాంక్ష. పవన విద్యుత్, సౌర విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా క్లీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడమే కాకుండా, ఆ విద్యుత్‌ను గ్రీన్ మాలిక్యూల్స్ రూపంలోకి మార్చి ప్రపంచవ్యాప్తంగా సరఫరా చేయడంతో పాటు, దేశీయంగా మన ఇంధన అవసరాలను కూడా తీర్చగలగాలి. దేశం కూడా ఇదే విధానాన్ని అనుసరించాలని నేను కోరుకుంటున్నాను.

గ్రీన్ మాలిక్యూల్స్ కీలక పాత్ర : గౌరవ సీఎం చంద్రబాబు కూడా ఈరోజు చేసిన ప్రసంగంలో మన ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడుతున్నామని స్పష్టం చేశారు. దీర్ఘకాలంలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఇంధన రంగంలో మనం స్వయం సమృద్ధి సాధించడం చాలా ముఖ్యం. ఈ లక్ష్య సాధనలో గ్రీన్ మాలిక్యూల్స్ కీలక పాత్ర పోషిస్తాయి. ఈ అంశంపై జరుగుతున్న చర్చ ఇంధన ఉత్పత్తి నుంచి వినియోగం వరకు అన్ని దశలను సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఎందుకంటే మనం ఇప్పటికే సౌర విద్యుత్, పవన విద్యుత్, ఇంధన నిల్వ వ్యవస్థలపై పనిచేస్తున్నాం. అదే సమయంలో గ్రీన్ మాలిక్యూల్స్ ఉత్పత్తి చేస్తున్న కంపెనీలు కూడా ఉన్నాయి. అయితే ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో సాధించిన అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటూ, ఈ మొత్తం ప్రక్రియను సమగ్రంగా పరిశీలించాలి. తద్వారా ఈ ప్రయాణంలో భారత్ వేగంగా ముందుకు వెళ్లేందుకు వీలవుతుంది.

పెరిగే విద్యుత్ అవసరాలకు అనుగుణంగా.. : గత ఏడాది కాలంగా ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ వినియోగం దాదాపు 30 శాతం పెరిగింది. వాస్తవానికి, ఇప్పుడిప్పుడే కార్యరూపం దాలుస్తున్న అవగాహన ఒప్పందాలు, ప్రారంభం కానున్న వాణిజ్య ఉత్పత్తిని పరిగణనలోకి తీసుకోకముందే ఈ పెరుగుదల నమోదైంది. ఇప్పటికే కొన్ని కంపెనీలు వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. వీటికి తోడు డేటా సెంటర్లు కూడా రాష్ట్రంలో ఏర్పాటు కావడం మనం చూస్తున్నాం. దీంతో 2028నాటికి



మన విద్యుత్ అవసరాలు దాదాపు రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. సంప్రదాయ ఇంధన వనరుల ద్వారా కొంత మేర బేస్‌లోడ్ విద్యుత్ అవసరాలను తీర్చుకోవాల్సి ఉంటుంది. అయితే ఒక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు సహజ వనరుల పరంగా మంచి అవకాశాలు ఉన్నాయి. మనకు పవన విద్యుత్ ఉత్పత్తికి అనువైన ప్రాంతాలు ఉన్నాయి. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు చేపట్టేందుకు అనువైన ప్రదేశాలు ఉన్నాయి. ముఖ్యంగా రాయలసీమలో సౌర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన సూర్యరశ్మి సమృద్ధిగా లభిస్తుంది. కాబట్టి సౌర విద్యుత్ విషయంలో మనకు పెద్దగా సమస్య లేదు.

అయితే ఇక్కడ ప్రధాన సవాలు ప్రాజెక్టులను ఎంత వేగంగా పూర్తి చేయగలమన్నదే. ఎందుకంటే మరో రెండున్నర నుంచి మూడు సంవత్సరాల్లో మన విద్యుత్ అవసరాలు కనీసం రెట్టింపు కావడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టిన సంస్థల ముందున్న సవాల్.. పోటీ ధరలకు నిరంతరాయంగా గ్రీన్ ఎనర్జీని ఎలా అందించగలమన్నది. పగటిపూట సౌర విద్యుత్ ధరలు గణనీయంగా తగ్గి యూనిట్‌కు 50 పైసల స్థాయికి చేరుకున్నాయి. అయితే రాత్రి వేళల్లో ధరలు మళ్లీ యూనిట్‌కు రూ. 10కి చేరుతున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న ధరల పరిమితిని తొలగిస్తే, యూనిట్ ధర రూ. 30కి కూడా చేరవచ్చు. కాబట్టి నిరంతరాయంగా అందుబాటులో ఉండే గ్రీన్ ఎనర్జీని పోటీ ధరలకు ఎలా అందించాలన్నదే మన ముందున్న ప్రధాన లక్ష్యం. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆసక్తితో ముందుకు సాగుతోంది. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపై కూడా పనిచేసేందుకు ఒప్పందం చేసుకున్నాం. అయితే ఈ ప్రాజెక్టులను చాలా వేగంగా నిర్మించాల్సిన అవసరం ఉంది. ఇతర జలవిద్యుత్ ప్రాజెక్టుల మాదిరిగా సంప్రదాయ పద్ధతుల్లో ఐదు నుంచి ఏడు సంవత్సరాల సమయం తీసుకునే విధానాన్ని ఇక్కడ అనుసరించలేం. ఎందుకంటే పెట్టుబడి వ్యయం చాలా ఎక్కువ. ఈరోజు ప్రాజెక్టును నిర్మించకపోతే, మరో మూడు సంవత్సరాల తర్వాత అదే ప్రాజెక్టు నిర్మాణానికి రెట్టింపు ఖర్చు చేయాల్సి రావచ్చు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం వేగవంతమైన అమలుకు ప్రాధాన్యత ఇస్తోంది.

2019 నుంచి 2024 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ విధానపరమైన స్థిరత్వం లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంది. అయితే 2024 తర్వాత మేం తీసుకున్న ప్రధాన చర్య.. పరిశ్రమలకు విధానపరమైన స్థిరత్వాన్ని కల్పించడం, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించాం. పరిశ్రమలతో ఉన్న సమస్యలను పరిష్కరించి, కొత్త ఆరంభానికి మార్గం సుగమం చేశాం. దీని ఫలితంగా గత ఏడాది కాలంలోనే రాష్ట్రంలో దాదాపు 4.8 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని అదనంగా చేర్చగలిగాం. అదే 2019 నుంచి 2024 మధ్య ఐదేళ్లలో కేవలం 6 మెగావాట్ల సామర్థ్యం మాత్రమే అదనంగా చేరింది. సౌర విద్యుత్, పవన విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ వంటి ప్రాజెక్టులన్నీ దీర్ఘకాలిక పెట్టుబడులతో కూడుకున్నవి. కాబట్టి పరిశ్రమలకు విధానపరమైన స్థిరత్వం ఎంతో అవసరం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి కూడా చాలా కీలకమైన పాత్ర ఉంది.

ప్రతి సంవత్సరం గోదావరి నది నుంచి దాదాపు 3,000 టీఎంసీల నీరు బంగాళాఖాతంలో కలుస్తోంది. 3,000 టీఎంసీల నీరు అంటే.. బ్రెజిల్ దేశం ఒక ఏడాదిలో వినియోగించే నీటి పరిమాణానికి ఇది దాదాపు సమానం. ఏపీలో పోలవరం ప్రాజెక్టుతో ఈ నీటిని నిల్వ చేసి, వ్యవసాయం, పారిశ్రామిక అవసరాలు, గృహావసరాల కోసం వినియోగంలోకి తీసుకువస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న ప్రాజెక్టులను పరిశీలిస్తే.. గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. ఇది ఎయిర్ కూల్డ్ డేటా సెంటర్. అంటే నీటిని ఉపయోగించి చల్లబరిచే విధానం కాకుండా, గాలి ద్వారా శీతలీకరణ చేసే సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. అంతేకాకుండా, ఈ ప్రాజెక్టుకు పునరుత్పాదక ఇంధనం ఆధారంగా విద్యుత్ అందిస్తారు. మనం బొగ్గు ఆధారిత విద్యుత్ నుంచి స్వచ్ఛమైన ఇంధన వనరుల వైపు మార్పు గురించి మాట్లాడుతున్నాం. అయితే ఒక గిగావాట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసే థర్మల్ విద్యుత్ కేంద్రం.. అదే పరిమాణంలో విద్యుత్ వినియోగించే డేటా సెంటర్‌తో పోలిస్తే దాదాపు పది రెట్లు ఎక్కువ నీటిని వినియోగిస్తుంది. కానీ ఈ అంశంపై ఎవరూ పెద్దగా చర్చించడం లేదు. అందుకే ఈ గణాంకాలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మరోవైపు పర్యావరణ పరిరక్షణకు ప్రజాప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు కానున్న డేటా సెంటర్ల విషయంలో కనీసం 80 శాతం విద్యుత్ అవసరాలను గ్రీన్ ఎనర్జీ ద్వారా తీర్చాలనే నిబంధన ఉంది. అంతేకాకుండా, అవన్నీ ఎయిర్ కూల్డ్ విధానంలోనే పనిచేయనున్నాయి. కాబట్టి డేటా సెంటర్లపై యువతలో ఉన్న అపోహలు, ఆందోళనలను తొలగించాల్సిన అవసరం ఉంది. మరోవైపు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో యువత తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేస్తుండటం మంచి పరిణామం. అయితే వారు ఉపయోగిస్తున్న ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలు కూడా డేటా సెంటర్లపైనే ఆధారపడి పనిచేస్తున్నాయన్న వాస్తవాన్ని గుర్తించాలి. నేటి భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో డేటా సెంటర్లు చాలా కీలకమైనవి. ముఖ్యంగా భారతదేశానికి సంబంధించిన డేటా, మన పౌరుల వ్యక్తిగత డేటా మన దేశ భూభాగంలోనే భద్రపరచటం ఎంతో ముఖ్యం.


ఈ కార్యక్రమంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ మినరల్స్ హెడ్ రాబర్టో బోకా, ఏసీఎంఈ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈవో నిఖిల్ ధింగ్రా, రిసొల్వెన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పరాగ్ శర్మ, సుజ్లాన్ కార్పొరేట్ అఫైర్స్ అండ్ రిటైల్ బిజినెస్ ప్రెసిడెంట్ దినేష్ జగ్దాలే, క్లీన్ మ్యాక్స్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కుల్దీప్ జైన్ పాల్గొన్నారు.

జర్నలిస్ట్ ఫైల్ JOURNALIST FILE
సంపాదక స్వరం EDITORIAL
ప్రజా ప్రయోజనం | వాస్తవ విశ్లేషణ | బాధ్యతాయుత అభిప్రాయం

- కూటమి ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం
- ఆర్థిక వనరుల సమీకరణతో పాటు నిధుల సద్వినియోగంపైనా దృష్టి
- గ్రామ స్వరాజ్యానికి ఆచరణాత్మక కార్యాచరణే కీలకం

టీడీపీలో మారుతున్న నాయకత్వ శైలి!

- పార్టీ క్రమశిక్షణకు లోకేశ్ కొత్త నిర్వచనం
- హెచ్చరికల నుంచి క్రమశిక్షణ చర్యల దిశగా లోకేశ్ అడుగులు
- అధికారంలో ఉన్నామనే అహంకారానికి, పార్టీ పట్ల నిర్లక్ష్యానికి ఇక చోటులేదనే సంకేతాలు
- కూటమి ఐక్యత, క్షేత్రస్థాయి నాయకుల పనితీరుపై లోకేశ్ నిఘా



తెలుగుదేశం పార్టీలో నాయకత్వ శైలి మారుతోందా? పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అనుసరించిన రాజకీయ సమన్వయానికి, మంత్రి, పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ ప్రాధాన్యమిస్తున్న క్రమశిక్షణకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోందా? తాజాగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఈ ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. పార్టీ కోసం పనిచేయని నాయకులు, కూటమి అభ్యర్థులకు సహకరించని నేతలు, అధిష్ఠానం ఆదేశాలను పట్టించుకోని ప్రజాప్రతినిధుల విషయంలో ఇక ఉపేక్షించే ప్రసక్తే లేదన్న లోకేశ్ హెచ్చరికలు టీడీపీలో అంతర్గత రాజకీయాలకు కొత్త సంకేతాలిస్తున్నాయి.

రాజకీయ పార్టీల్లో అధికారం మారడం ఒక పరిణామమైతే, నాయకత్వ సంస్కృతి మారడం మరో కీలక పరిణామం. ఒక పార్టీని నిర్మించడం ఎంత కష్టమో, అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని క్రమశిక్షణతో నడిపించడం అంతకంటే కష్టం. ముఖ్యంగా సుదీర్ఘ రాజకీయ అనుభవం, వ్యక్తిగత పలుకుబడి, ప్రాంతీయ ఆధిపత్యం కలిగిన నాయకులతో నిండిన తెలుగుదేశం వంటి పార్టీలో నాయకత్వ నిర్ణయాలను అమలు చేయించడం అంత సులభం కాదు. ఇప్పుడు టీడీపీలో కనిపిస్తున్న పరిణామాలు ఇదే వాస్తవాన్ని గుర్తుచేస్తున్నాయి. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అనుసరించిన హెచ్చరికలు, సమన్వయ రాజకీయాలకు భిన్నంగా మంత్రి నారా లోకేశ్ కఠినమైన క్రమశిక్షణ వైఖరిని ప్రదర్శించడం పార్టీలో కొత్త చర్చకు తెరతీస్తోంది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి మెరుగైన ఫలితాలు సాధించినప్పటికీ, కొన్ని జిల్లాల్లో ఎదురైన పరాజయాలు అధికార పార్టీకి ఆత్మపరిశీలన అవసరాన్ని గుర్తుచేశాయి. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 11 జడ్పీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఏడు స్థానాలు గెలుచుకోవడం, టీడీపీ మూడు స్థానాలకే పరిమితం కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అనంతపురం, విజయనగరం, చిత్తూరు తదితర ప్రాంతాల్లోనూ ప్రతిపక్షం కొన్ని స్థానాల్లో పుంజుకోవడం అధికార కూటమి నాయకత్వాన్ని ఆలోచనలో పడేసింది. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ఆధిపత్యం కొనసాగుతున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఈ ఫలితాలు స్థానిక నాయకత్వ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తాయి.

ఈ నేపథ్యంలో పార్టీ నిర్వహించిన సమీక్షలు, అంతర్గత సర్వేల్లో వెలుగుచూసిన అంశాలు లోకేశ్ ఆగ్రహానికి కారణమయ్యాయి. ముఖ్యంగా కూటమి భాగస్వామ్య పక్షాలకు కేటాయించిన స్థానాల్లో టీడీపీ స్థానిక నాయకులు ఆశించిన స్థాయిలో సహకరించలేదన్న ఆరోపణలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అభ్యర్థుల ఎంపికపై అసంతృప్తి, సీట్ల సర్దుబాటులో సమన్వయ లోపాలు, స్థానిక నాయకుల మధ్య ఆధిపత్య పోరు, ప్రచారంలో నిర్లక్ష్యం వంటి అంశాలు కూటమి విజయావకాశాలను దెబ్బతీశాయని తెలుస్తోంది. ఎన్నికల సమయంలో రెబల్స్‌గా బరిలోకి దిగిన 40 మంది నాయకులపై ఇప్పటికే సస్పెన్షన్ వేటు వేయడం కూడా పార్టీ క్రమశిక్షణ విషయంలో నాయకత్వం తీసుకుంటున్న వైఖరికి నిదర్శనం.

లోకేశ్ తాజా వ్యాఖ్యల్లో ప్రధానంగా కనిపిస్తున్న అంశం జవాబుదారీతనం. ఎవరు పనిచేశారు? ఎవరు బాధ్యతల నుంచి తప్పించుకున్నారు? ఎవరు కూటమి ధర్మాన్ని పాటించారు? ఎవరు పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరించారు? అనే వివరాలు తన వద్ద ఉన్నాయని ఆయన స్పష్టం చేయడం సాధారణ రాజకీయ హెచ్చరికగా చూడలేం. నాయకుల పనితీరును నివేదికలు, సర్వేలు, క్షేత్రస్థాయి సమాచారం ఆధారంగా అంచనా వేసే విధానానికి ఆయన ప్రాధాన్యమిస్తున్నారనే సంకేతం ఇందులో ఉంది.

ఇక్కడే చంద్రబాబు, లోకేశ్ నాయకత్వ శైలుల మధ్య చర్చ మొదలవుతోంది. చంద్రబాబు రాజకీయంగా సుదీర్ఘ అనుభవం కలిగిన నాయకుడు. వివిధ వర్గాలను సమన్వయం చేసుకుంటూ, అసంతృప్తులను బుజ్జగిస్తూ, అవసరమైనప్పుడు హెచ్చరికలతో పరిస్థితులను చక్కదిద్దే రాజకీయ వ్యూహాన్ని ఆయన అనేక సందర్భాల్లో అనుసరించారు. అయితే ఆ విధానం వల్ల కొందరు నాయకుల్లో బాధ్యతారాహిత్యం పెరిగిందనే విమర్శలు కూడా ఉన్నాయి. దీనికి భిన్నంగా లోకేశ్ పనితీరు ఆధారిత గుర్తింపు, పార్టీ నిర్ణయాల అమలు, క్రమశిక్షణ, బాధ్యతల నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే ఇద్దరి నాయకత్వ శైలులను పరస్పర విరుద్ధమైనవిగా చూడటం కంటే, పార్టీ మారుతున్న రాజకీయ అవసరాలకు అనుగుణంగా నాయకత్వంలో వస్తున్న పరిణామంగా విశ్లేషించడం సముచితం.

అయితే కఠిన చర్యలే పార్టీ బలోపేతానికి ఏకైక పరిష్కారం కావు. ఎన్నికల్లో ఓటమికి నాయకుల నిర్లక్ష్యమే కారణమా? అభ్యర్థుల ఎంపికలో లోపాలున్నాయా? కూటమి భాగస్వాముల మధ్య సీట్ల పంపిణీ సక్రమంగా జరిగిందా? స్థానికంగా ప్రజల్లో ఉన్న అసంతృప్తిని నాయకత్వం ముందుగానే గుర్తించగలిగిందా? అనే ప్రశ్నలకు కూడా సమాధానాలు వెతకాలి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రతిపక్షానికి లభించిన మద్దతును కేవలం కూటమి సమన్వయ లోపానికి మాత్రమే ఆపాదించడం సరైన రాజకీయ విశ్లేషణ కాదు. అక్కడి ప్రజల సమస్యలు, అభివృద్ధి ఆకాంక్షలు, ప్రభుత్వ పథకాల అమలు, స్థానిక నాయకత్వం అందుబాటు వంటి అంశాలను కూడా లోతుగా పరిశీలించాలి.

మరో కీలక అంశం కూటమి ధర్మం. అధికారంలో ఉన్నప్పుడు భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం మరింత అవసరం. ఒక పార్టీకి కేటాయించిన స్థానంలో మరో పార్టీ నాయకులు అంతర్గతంగా సహకరించకపోతే, దాని ప్రభావం ఎన్నికలకే పరిమితం కాదు. ప్రభుత్వ స్థిరత్వం, పరస్పర విశ్వాసం, భవిష్యత్ రాజకీయ సంబంధాలపైనా పడుతుంది. అందువల్ల కూటమి నిర్ణయాలను గౌరవించని నాయకులపై చర్యలు తీసుకోవడం అవసరమే. అదే సమయంలో భాగస్వామ్య పక్షాలకు న్యాయమైన ప్రాతినిధ్యం, స్థానిక నాయకుల అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యం కల్పించడమూ అంతే ముఖ్యం.

లోకేశ్ ముందున్న అసలు సవాలు నాయకులను హెచ్చరించడం కాదు.. వారిలో బాధ్యతాయుతమైన రాజకీయ సంస్కృతిని పెంపొందించడం. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు, ప్రజాప్రతినిధులకు నిర్దిష్ట బాధ్యతలు, పనితీరుకు పారదర్శకమైన మూల్యాంకనం, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పర్యవేక్షణ ఉండాలి. తప్పు చేసినవారిపై చర్యలు తీసుకున్నట్లే, సమర్థంగా పనిచేసినవారిని ప్రోత్సహించాలి. పార్టీ అధిష్ఠానం నిర్ణయాలను అమలు చేయడంలో నిష్పాక్షికత కనిపించాలి. అప్పుడే క్రమశిక్షణకు రాజకీయ విశ్వసనీయత లభిస్తుంది.

టీడీపీలో నాయకత్వ బాధ్యతల భవిష్యత్ పరిణామాలపై ఊహాగానాలు ఎలా ఉన్నా, ప్రస్తుత పరిణామాలు లోకేశ్ తన సంస్థాగత నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సిన కీలక దశకు చేరుకున్నారని సూచిస్తున్నాయి. చంద్రబాబు నిర్మించిన రాజకీయ, సంస్థాగత పునాదులను కాపాడుతూనే కొత్త తరహా పనితీరు సంస్కృతిని తీసుకురావడం అంత సులభం కాదు. సీనియర్ నాయకుల అనుభవాన్ని గౌరవిస్తూ, యువ నాయకత్వానికి బాధ్యతలు అప్పగిస్తూ, కేడర్‌లో ఉత్సాహాన్ని నిలబెట్టాల్సి ఉంటుంది.

అంతిమంగా పార్టీకి అవసరమైనది భయంతో పనిచేసే నాయకులు కాదు.. బాధ్యతతో పనిచేసే నాయకులు. హెచ్చరికలతో తాత్కాలిక క్రమశిక్షణ సాధ్యమే కానీ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి నిరంతర పనితీరు అవసరం. స్థానిక ఎన్నికల ఫలితాలను హెచ్చరికగా తీసుకుని టీడీపీ తన సంస్థాగత లోపాలను సరిదిద్దుకుంటుందా? లేక చర్యలు కొందరు నాయకులకే పరిమితమవుతాయా? అన్నదే కీలకం.

టీడీపీలో ఇప్పుడు జరుగుతున్నది కేవలం నాయకులపై హెచ్చరికల పర్వం కాదు. పార్టీ భవిష్యత్ నాయకత్వ స్వరూపాన్ని నిర్ణయించే ప్రక్రియలో భాగంగా చూడాల్సిన పరిణామం. చంద్రబాబు నిర్మించిన రాజకీయ సామ్రాజ్యాన్ని తదుపరి తరానికి అందించడమే కాకుండా, మారుతున్న రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా పార్టీని పునర్వ్యవస్థీకరించాల్సిన బాధ్యత లోకేశ్‌పై ఉంది. ఒక విషయం స్పష్టం. అధికారంలో ఉన్నామనే ధీమాతో పార్టీ బాధ్యతలను విస్మరించే నాయకులకు ఇక పాత తరహా రాజకీయ రక్షణ లభిస్తుందనే నమ్మకం సడలుతోంది. హెచ్చరికలతో మొదలైన ఈ పరిణామం నిజమైన సంస్థాగత సంస్కరణగా మారితేనే టీడీపీకి దీర్ఘకాలిక రాజకీయ ప్రయోజనం చేకూరుతుంది.



గ్రామ పంచాయతీలకు నిధుల జల్లు... అభివృద్ధికి కొత్త కళ!

గ్రామీణాభివృద్ధికి పునాది గ్రామ పంచాయతీలు. గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, అంతర్గత రహదారులు, వీధి దీపాలు, మురుగునీటి నిర్వహణ, పచ్చదనం వంటి కనీస అవసరాలను తీర్చాల్సిన బాధ్యత స్థానిక సంస్థలదే. గ్రామ ప్రజలకు ప్రభుత్వ పాలన అత్యంత చేరువగా కనిపించే వ్యవస్థ కూడా పంచాయతీరాజ్ వ్యవస్థే. అయితే విధులు విస్తృతంగా ఉన్నప్పటికీ, వాటిని సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన ఆర్థిక స్వావలంబన లేకపోవడం అనేక దశాబ్దాలుగా గ్రామ పంచాయతీలను వేధిస్తున్న సమస్య. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధుల కేటాయింపు, అభివృద్ధి పనుల అమలుపై ప్రత్యేక దృష్టి సారించడం గ్రామీణ పాలనకు సానుకూల పరిణామం.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాలు గ్రామీణ మౌలిక సదుపాయాలపై కొత్త చర్చకు తెరతీశాయి. పల్లె పండుగ కార్యక్రమాలు, సిమెంట్ రహదారులు, బీటీ రోడ్లు, గోకులాలు, వ్యవసాయ కుంటలు, పశువుల నీటి తొట్లు, తాగునీటి పథకాలు వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు చేపట్టిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెంచడం గమనార్హం. నియోజకవర్గాల వారీగా పనుల వివరాలు, నిధుల కేటాయింపులు, పురోగతిని వెల్లడించే ప్రత్యేక పుస్తకాన్ని కూడా ప్రభుత్వం విడుదల చేసింది. కూటమి ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాలతో పాటు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు గెలిచిన 11 నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి పనుల వివరాలను అందులో పొందుపరచడం సమతుల్య పాలనకు సంబంధించిన అంశం.

గ్రామ పంచాయతీలకు ఆర్థిక వనరుల సమీకరణలో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్ గ్రాంట్ల తొలి విడతగా ఆంధ్రప్రదేశ్‌కు రూ.410.76 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులు 13,092 అర్హత కలిగిన గ్రామ పంచాయతీలు, 650 మండల పరిషత్‌లు, 13 జిల్లా పరిషత్‌లకు ప్రయోజనం చేకూర్చేలా కేటాయించారు. అనంతరం రెండో విడతగా మరో రూ.410.76 కోట్లను విడుదల చేసినట్లు కేంద్ర ప్రభుత్వ ప్రకటన వెల్లడించింది. అన్‌టైడ్ నిధులను స్థానిక అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే అవకాశం ఉండగా, టైడ్ గ్రాంట్లను ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ వంటి నిర్దిష్ట సేవలకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

ఇక 2026-27 నుంచి 2030-31 వరకు ఐదేళ్ల కాలానికి 16వ ఆర్థిక సంఘం కింద ఆంధ్రప్రదేశ్ గ్రామీణ స్థానిక సంస్థలకు సుమారు రూ.16,627 కోట్ల నిధులు లభించనున్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఇందులో రూ.13,302 కోట్లు బేసిక్ గ్రాంట్లు, రూ.3,325 కోట్లు పనితీరు ఆధారిత గ్రాంట్లుగా ప్రతిపాదించారు. 15వ ఆర్థిక సంఘం కేటాయింపులతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల. అయితే ఈ నిధుల విడుదలకు నిర్దేశించిన అర్హతలు, ఎన్నికల నిర్వహణ, ఆన్‌లైన్ ఖాతాల నిర్వహణ, అభివృద్ధి ప్రణాళికల సమర్పణ వంటి నిబంధనలను పంచాయతీలు పాటించాల్సి ఉంటుంది. అంటే నిధులు రావడమే కాదు, వాటిని పొందేందుకు స్థానిక సంస్థలు పరిపాలనా సామర్థ్యాన్ని కూడా పెంచుకోవాలి.

అయితే నిధుల కేటాయింపులే గ్రామీణాభివృద్ధికి పూర్తి హామీ అని భావించలేం. గత అనుభవాలు ఈ విషయంలో అప్రమత్తం చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ సంస్థల ఆర్థిక పరిస్థితిపై 16వ ఆర్థిక సంఘం అధ్యయన నివేదికలో గ్రామ పంచాయతీలకు విడుదలైన నిధులు పెరిగినప్పటికీ, వాటి ఖర్చు అదే స్థాయిలో పెరగలేదని పేర్కొంది. 2018-19లో విడుదలైన నిధుల్లో సుమారు 87 శాతం ఖర్చు కాగా, 2022-23 నాటికి ఈ నిష్పత్తి దాదాపు 65 శాతానికి తగ్గింది. అంటే నిధుల సమీకరణతో పాటు వాటిని సకాలంలో, సమర్థంగా వినియోగించే వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఇక్కడే స్థానిక పాలనలో జవాబుదారీతనం కీలకమవుతుంది. ప్రతి గ్రామ పంచాయతీకి ఏ పథకం కింద ఎంత నిధి వచ్చింది? ఏ పనికి ఎంత ఖర్చు చేశారు? పనులు ఎప్పుడు ప్రారంభమయ్యాయి? నాణ్యత ఎలా ఉంది? కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారా? అనే వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. గ్రామసభలను కేవలం ఆచారంగా కాకుండా, గ్రామ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించే ప్రజాస్వామ్య వేదికలుగా మార్చాలి. పనుల ఎంపికలో స్థానిక ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నిధుల వినియోగంపై సామాజిక తనిఖీలు, ఆన్‌లైన్ పర్యవేక్షణ, స్వతంత్ర ఆడిట్ వ్యవస్థలు సమర్థంగా పనిచేయాలి.

అలాగే పంచాయతీలు పూర్తిగా ప్రభుత్వ గ్రాంట్లపైనే ఆధారపడకుండా సొంత ఆదాయ వనరులను పెంచుకోవాలి. ఆస్తిపన్ను వసూళ్లు, స్థానిక ఆదాయ మార్గాల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల సమన్వయం ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని సాధించాలి. రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సులను సమర్థంగా అమలు చేయడం, ఆదాయ వనరులు తక్కువగా ఉన్న పంచాయతీలకు ప్రత్యేక సహకారం అందించడం కూడా అవసరం. విద్యుత్ బిల్లులు, నిర్వహణ ఖర్చులు, గతంలో చేపట్టిన పనుల బకాయిలు వంటి సమస్యలను పరిష్కరించకుండా కొత్త పనులు చేపట్టడం వల్ల పంచాయతీలు మళ్లీ ఆర్థిక ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది.

గ్రామ పంచాయతీలకు నిధులు అందించడం అనేది కేవలం అభివృద్ధి కార్యక్రమం కాదు.. ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు ఇచ్చే బలం. రాజ్యాంగంలోని 73వ సవరణ ద్వారా స్థానిక స్వపరిపాలన సంస్థలకు కల్పించిన ప్రాధాన్యతను ఆచరణలో నిలబెట్టినప్పుడే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం నిధుల కేటాయింపుతో పాటు విధులు, సిబ్బంది, ఆర్థిక అధికారాలను కూడా స్థానిక సంస్థలకు బదిలీ చేయాలి. గ్రామ అవసరాలను గ్రామస్థాయిలోనే గుర్తించి, నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ కల్పించాలి. కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధుల సమీకరణ, అభివృద్ధి పనులపై చూపుతున్న శ్రద్ధను స్వాగతించాల్సిందే. అయితే ఈ ప్రయత్నం రాజకీయ ప్రచారానికి పరిమితం కాకుండా గ్రామాల రూపురేఖలు మార్చే కార్యాచరణగా నిలవాలి. ప్రతి రూపాయి ప్రజల అవసరాలకు ఉపయోగపడాలి. ప్రతి పని నాణ్యతతో పూర్తికావాలి. ప్రతి గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావాలి. నిధుల కేటాయింపుల గణాంకాల కంటే ప్రజల జీవితాల్లో కనిపించే మార్పే ప్రభుత్వ పనితీరుకు అసలైన కొలమానం. గ్రామం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. గ్రామ పంచాయతీలు బలోపేతమైతేనే ప్రజాస్వామ్యం క్షేత్రస్థాయిలో బలపడుతుంది.

ప్రపంచ రాజకీయాలకు పర్యావరణం ఎందుకు భారమవుతోంది?

- యుద్ధాలు.. వాణిజ్య పోరాటాల మధ్య మరుగునపడుతున్న వాతావరణ సంక్షోభం..
- ప్రపంచ నేతల ప్రాధాన్యతల్లో ప్రకృతి పరిరక్షణకు తగ్గుతున్న స్థానం..
- లూలా హెచ్చరిక వెనుక దాగిన అంతర్జాతీయ రాజకీయ వాస్తవాలు!



ప్రపంచాన్ని కుదిపేస్తున్న యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితి, వాణిజ్య సుంకాల పోరాటాలు, ఆయుధ పోటీ.. ఇవన్నీ అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశాలుగా మారాయి. దేశాల మధ్య ఆధిపత్య పోరు తీవ్రతరమవుతున్న కొద్దీ మానవాళి భవిష్యత్తును ప్రభావితం చేసే మరో అతిపెద్ద సంక్షోభం మాత్రం తెర వెనక్కి వెళ్లిపోతోంది. అదే వాతావరణ మార్పు. భూగోళం వేడెక్కుతున్నా, ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నా, సముద్ర మట్టాలు ఎగసిపడుతున్నా ప్రపంచ పాలకుల ప్రాధాన్యతల్లో పర్యావరణ పరిరక్షణకు తగిన స్థానం లభించడం లేదన్న బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా వ్యాఖ్యలు అంతర్జాతీయ సమాజాన్ని ఆలోచింపజేస్తున్నాయి.

టర్కీలోని అంటాల్యాలో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు కాప్-31లో లూలా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత ప్రపంచ రాజకీయాల తీరుకు అద్దం పడుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి ప్రపంచ నేతల ప్రసంగాలు, అధికారిక పత్రాల్లో వాతావరణ మార్పుల ప్రస్తావన తగ్గిపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో అత్యధిక గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేసే దేశాలకు చెందిన నాయకులు పాల్గొనే జి-7, జి-20 వేదికల్లోనూ పర్యావరణ అంశంపై మౌనం అలముకుందని విమర్శించారు. భవిష్యత్ తరాల మనుగడ గురించి చర్చించాల్సిన నేతలు ఆయుధాలు, వాణిజ్య సుంకాల గురించి ఎక్కువగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. ఇది ఒక అధ్యక్షుడి ఆవేదన మాత్రమే కాదు.. ప్రపంచ నాయకత్వం ఎదుర్కొంటున్న ప్రాధాన్యతల సంక్షోభంపై చేసిన తీవ్రమైన హెచ్చరిక.

నిజానికి వాతావరణ సంక్షోభం రాజకీయ సరిహద్దులను గుర్తించదు. ఒక దేశంలో వెలువడే కర్బన ఉద్గారాల ప్రభావం మరో దేశానికీ తప్పదు. పారిశ్రామికీకరణ, బొగ్గు, చమురు, సహజవాయువు వినియోగం, అడవుల విధ్వంసం భూమి ఉష్ణోగ్రతలను పెంచుతున్నాయి. ఫలితంగా ఒకవైపు కరువులు, మరోవైపు అతివృష్టి, వరదలు, కార్చిచ్చులు, తీవ్రమైన వేడిగాలులు ప్రపంచ దేశాలను వెంటాడుతున్నాయి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ సైతం కాప్-31 వేదికగా 2025లో ఉద్గారాలు రికార్డు స్థాయికి చేరాయని, ఉష్ణోగ్రతల రికార్డులు వరుసగా బద్దలవుతున్నాయని హెచ్చరించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

అయితే ప్రపంచ దేశాల రాజకీయ ప్రాధాన్యతల్లో పర్యావరణం వెనుకబడటానికి కారణాలు ఏమిటి? రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రక్షణ వ్యయం పెంపు, అమెరికా సహా ప్రధాన ఆర్థిక వ్యవస్థల వాణిజ్య విధానాలు ప్రపంచ దేశాల దృష్టిని తక్షణ భద్రత, ఆర్థిక ప్రయోజనాల వైపు మళ్లించాయి. ఇంధన సరఫరా భద్రత పేరుతో సంప్రదాయ శిలాజ ఇంధనాలపై ఆధారపడే ధోరణి కొనసాగుతోంది. మరోవైపు పునరుత్పాదక ఇంధన వనరుల వైపు మార్పును కొందరు దేశాలు ఆర్థిక భారంగా, జాతీయ భద్రతకు సవాలుగా చిత్రీకరిస్తున్నాయి. ఈ పరిస్థితి వాతావరణ ఒప్పందాల అమలును మరింత సంక్లిష్టం చేస్తోంది.

ఇక్కడ మరో ముఖ్యమైన అంశం అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య బాధ్యతల విభజన. పారిశ్రామిక విప్లవం నుంచి ఇప్పటివరకు ప్రపంచ వాతావరణ కాలుష్యంలో సంపన్న దేశాల చారిత్రక పాత్ర గణనీయమైనది. కానీ వాతావరణ మార్పుల ప్రభావాన్ని అత్యధికంగా ఎదుర్కొంటున్నది ఆర్థికంగా బలహీనమైన దేశాలు, ద్వీప దేశాలు, వ్యవసాయంపై ఆధారపడిన సమాజాలు. వీటికి వాతావరణ మార్పులను ఎదుర్కొనే ఆర్థిక, సాంకేతిక సామర్థ్యం పరిమితంగా ఉంది. అందువల్ల అభివృద్ధి చెందిన దేశాలు ఉద్గారాల తగ్గింపుతో పాటు వాతావరణ నిధులు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ విషయంలోనూ తమ బాధ్యతను నెరవేర్చాలి. పర్యావరణ పరిరక్షణ పేరుతో అభివృద్ధి చెందుతున్న దేశాల పారిశ్రామిక ప్రగతికి అడ్డంకులు సృష్టించడం కూడా సమంజసం కాదు.

ఈ విషయంలో లూలా ప్రస్తావించిన ఆర్థిక అంశాలు కీలకం. బ్రెజిల్ గత కాప్-30 సదస్సులో ప్రతిపాదించిన బాకూ-బెలెం రోడ్‌మ్యాప్ ద్వారా వాతావరణ నిధులను ఏటా 1.3 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకెళ్లే లక్ష్యాన్ని ముందుకు తెచ్చింది. శిలాజ ఇంధనాలపై ఆధారాన్ని తగ్గించడం, అడవుల విధ్వంసాన్ని అరికట్టడం, అటవీ పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలు కూడా ఈ కార్యాచరణలో ఉన్నాయి. అయితే లక్ష్యాలు ప్రకటించడం కంటే వాటికి అవసరమైన నిధులు సమకూర్చడం, అమలు వ్యవస్థలను బలోపేతం చేయడమే అసలైన పరీక్ష.

భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ పరిణామాలు ప్రత్యేక ప్రాధాన్యత కలిగివున్నాయి. వ్యవసాయం, నీటి వనరులు, ఆరోగ్యం, పట్టణ మౌలిక సదుపాయాలపై వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో తుపానులు, సముద్ర తీర ప్రాంతాల కోత, అస్థిర వర్షపాతం, తీవ్రమైన ఉష్ణోగ్రతలు జీవనోపాధిపై ప్రభావం చూపుతున్నాయి. కాబట్టి పర్యావరణ పరిరక్షణను కేవలం అంతర్జాతీయ సదస్సుల అంశంగా కాకుండా అభివృద్ధి విధానాల్లో అంతర్భాగంగా చూడాల్సిన అవసరం ఉంది. పునరుత్పాదక ఇంధనం, నీటి సంరక్షణ, అడవుల విస్తరణ, విపత్తుల ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయ పద్ధతులకు పెట్టుబడులు పెంచాలి. ప్రపంచ దేశాలు ఇప్పుడు ఒక విషయాన్ని గుర్తించాలి. యుద్ధాల వల్ల భౌగోళిక సరిహద్దులు మారవచ్చు.. వాణిజ్య సుంకాల వల్ల ఆర్థిక సమీకరణాలు మారవచ్చు.. కానీ ప్రకృతి విధ్వంసం వల్ల ఏర్పడే నష్టాన్ని ఏ దేశమూ తన సరిహద్దులకే పరిమితం చేయలేరు. ఆధిపత్య రాజకీయాలు తాత్కాలిక విజయాలను అందించవచ్చేమో కానీ, పర్యావరణ విధ్వంసం భవిష్యత్ తరాలకు శాశ్వత సంక్షోభాన్ని మిగులుస్తుంది. లూలా హెచ్చరికలోని అసలు సందేశం ఇదే. వాతావరణ సంక్షోభం ప్రపంచ అజెండా నుంచి అదృశ్యం కాలేదు.. దానిని పట్టించుకోవాల్సిన రాజకీయ సంకల్పమే బలహీనపడుతోంది. కాప్ సదస్సులు ప్రకటనలు, హామీలు, ఒప్పందాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపాలి. సంపన్న దేశాలు బాధ్యత నుంచి తప్పించుకోకూడదు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు న్యాయమైన ఆర్థిక, సాంకేతిక సహకారం అందాలి. అంతర్జాతీయ సహకారం, శాస్త్రీయ దృక్పథం, రాజకీయ సంకల్పం కలిసివస్తేనే ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడం సాధ్యం. లేకపోతే నేడు ఆయుధాలు, సుంకాలపై సాగుతున్న ఆధిపత్య పోరుకు రేపటి తరాలు పర్యావరణ విపత్తుల రూపంలో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

పల్లెల సమగ్ర ప్రగతికే తొలి ప్రాధాన్యం

- స్వంత జిపి భవనాలతో సులభతర పాలన
- మహిళా సాధికారతకు వీఓ కేంద్రాలు ఊతం
- తెలంగాణ పబ్లిక్‌స్కూల్ సాధన విద్యారంగంలో నూతనఅధ్యాయం
- సింగభూపాలెం చెరువు అభివృద్ధితో సాగుకు కొత్త భరోసా
- రూ.50లక్షలతో నిర్మించిన జీపీ, వీఓ భవబనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే



కొత్తగూడెం నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) : పల్లెల సమగ్రప్రగతి, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రధాన ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కూనంనేనిసాంబశివరావు అన్నారు. మండల పరిధిలోని బేతంపూడి,మాలబంజర, 2ఇంక్లైన్ గ్రామాల్లో సుమారు రూ.50లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన అభివృద్ధి భవనాలను ఆయన బుధవారం రిబ్బన్‌కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.బేతంపూడి గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో, మాలబంజరలోమరో రూ.20లక్షలవ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాలను, 2ఇంక్లైన్ పంచాయతీ నూతనభవనాలను, 2ఇంక్లైన్ పంచాయతీ పరిధిలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన మహిళాసమాఖ్య భవనాన్ని ఆయన ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.ఈసందర్భంగా ఆయాగ్రామాల్లో ఏర్పాటుచేసిన ప్రారంభోత్సవసమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికసంస్థలకు సొంత భవనాలు సమకూరినప్పుడే గ్రామీణ పరిపరాలన సమర్థవంతంగా సాగుతుందని, ప్రజలకుసేవలు, వేగంగా అందుతాయని తెలిపారు.మహిళల ఆర్థిక, సామాజిక వికాసానికి వీఓ భవనాలు వేదికలుగా నిలవాలన్నారు. మండలానికి జూనియర్ కళాశాల ఈప్రాంతప్రజల చిరకాల వాంఛ అని, తెలంగాణ పబ్లిక్‌స్కూల్‌నుసాధించి వారి ఆశలు నెరవేర్చడం ద్వారా నూతన అధ్యాయానికి నాందిపలికామని, అదేవిధంగాసింగభూపాలెం చెరువు అభివృద్ధిపై దృష్టిసారించి నిధుల వరద కురిపించడం ద్వారా సాగుకు భరోసా కల్పించామన్నారు. గ్రామీణప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాబీర్‌పాషా, మేయర్ మూడ్ గణేష్, దస్రు, హన్మంతరావు, రాములు, కృష్ణప్రసాద్, ఎంపిడిఓ భారతి, పిఆర్ డీఈ నాగేందర్, ఏఈ నవీన్‌కుమార్, విద్యుత్ ఏఈ కిషన్, గ్రంథాలయ ఛైర్మన్ వీరబాబు, మండే హనుమంతరావు, గుగులోతుబాలు, నాగేంద్రబాబు, కృష్ణ, హత్తిరాం, వెంకన్న, సారయ్య, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్‌లో సిక్కు మైనార్టీలకు ప్రత్యేక కమిటీ

- రాష్ట్ర రాజకీయాల్లో తొలిసారిగా ప్రత్యేక విభాగం ఏర్పాటు
- రాష్ట్ర అధ్యక్షుడిగా జస్బీర్ సింగ్ సంధు..
  ప్రధాన కార్యదర్శిగా హర్‌ప్రీత్ సింగ్
- నియామక పత్రాలు అందజేసిన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్ర రాజకీయ చరిత్రలో తొలిసారిగా సిక్కు మైనార్టీల కోసం తెలంగాణ రక్షణ సేన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. సిక్కు మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్. జస్బీర్ సింగ్ సంధు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్. హర్‌ప్రీత్ సింగ్‌ను పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత నియమించారు. బుధవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో వారికి నియామక పత్రాలను అందజేశారు. రాజకీయ పార్టీల మైనార్టీ విభాగాల్లో సాధారణంగా ముస్లింలు, క్రిస్టియన్లతో పాటు సిక్కులు, ఇతర మైనార్టీలకు కూడా వివిధ పదవుల్లో ప్రాతినిధ్యం కల్పిస్తుంటారు. తెలంగాణ రక్షణ సేన ఇప్పటికే ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలకు వేర్వేరు కమిటీలను ప్రకటించగా.. తాజాగా సిక్కు మైనార్టీల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. మైనార్టీల్లోని ఒక్కో వర్గం సమస్యలు, అవసరాలు వేర్వేరుగా ఉంటాయని, ఆయా వర్గాలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు కల్వకుంట్ల కవిత వెల్లడించారు.

నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలపై మంత్రులతో జేఏసీ చర్చలు

- సమస్యల పరిష్కారానికి సానుకూల హామీ
- ఉద్యమ కార్యాచరణ యథాతథం
- పరిష్కారం వరకు అండగా ఉంటాం : మంత్రి అడ్లూరి



సికింద్రాబాద్, నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) : ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రజాభవన్‌లో మంత్రులతో జేఏసీ నాయకులు సుదీర్ఘంగా చర్చించారు.ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్,అడ్లూరి లక్ష్మణ్,వివేక్ వెంకటస్వామి,టీజే జేఏసీ నాయకుడు ఎల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉద్యోగుల వివిధ సమస్యలను,ముఖ్యంగా ఆర్థిక శాఖకు సంబంధించిన అంశాలను జేఏసీ నాయకులు మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన మంత్రులు ఫైనాన్స్‌కు సంబంధించిన అభ్యంతరాలను పరిశీలించి,వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్‌తో చర్చించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఉద్యోగుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కార మయ్యే వరకు తాను ఉద్యోగులకు,జేఏసీ నాయకులకు అండగా ఉంటానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ భరోసా ఇచ్చారు.మంత్రుల సానుకూల స్పందనపై జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఒకపక్కన మంత్రులు హామీనిచ్చినప్పటికీ మంత్రుల హామీతో పాటు ఇప్పటికే ప్రకటించిన ఉద్యమ కార్యాచరణలో ఎలాంటి మార్పు ఉండదని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు పూర్తిస్థాయి పరిష్కారం లభించే వరకు ప్రకటించిన కార్యక్రమాలను కొనసాగిస్తామని, తమ పోరాటాన్ని విరమించబోమని వెల్లడించారు.

గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలి

- వచ్చే ఏప్రిల్ నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం
- వివిఐపిలకు,భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం
- పనులను పరిశీలించిన దేవాదాయశాఖ ప్రిన్సిపల్‌సెక్రటరీ శైలజారామయ్యర్



భద్రాచలం నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) : రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకోని భద్రాచలంలోని గోదావరి నదీతీర ప్రాంతాల్లో చేపడుతున్న ఘాట్ల అభివృద్ధి పనులు, ఆలయ పరిసరాలు అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని దేవాదాయశాఖాప్రిన్సిపల్‌సెక్రటరీ శైలజారామయ్యర్ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులు, నూతన గోదావరి పుష్కరఘాట్ నిర్మాణం పనులను బుధవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి దేవాదాయ కమిషనర్‌హన్మంతరావు, జిల్లాకలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్‌రాజు, సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠతో కలిసి సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని చాంబర్లో సంబంధిత జిల్లా అధికారులు, వివిధ శాఖల ఇంజనీరింగ్‌అధికారులు, కన్సల్టెంట్లు,ఆర్కిటెక్టులు, కాంట్రాక్టర్లు, కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో శాఖల వారీగా చేపట్టిన పనుల పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులు, ఎదురవుతున్న సమస్యలు, పనులు పూర్తి చేయడానికి అవసరమైన చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ విదేశాల నుండి భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామివారిని దర్శించుటకు అవకాశం దొరుకుతుందని తప్పనిసరిగా గోదావరి పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, సురక్షితమైన స్థానాలు, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు, రహదారులు, తాగునీటిసరఫరా, విద్యుత్, పారిశుధ్యం, డ్రైనేజీ, వైద్యసదుపాయాలు, భద్రత, రవాణా, అగ్నిమాపక ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని సూచించారు.పుష్కర వనం కోసం అనువైన స్థలం సేకరించాలని, వివిఐపిలకు భక్తులకు వేరువేరుగా పార్కింగ్‌స్థలాలు ఏర్పాటు చేయాని, భక్తుల కోసం డార్మెటరీలు సిద్ధం చేయాలన్నారు.రాష్ట్రప్రభుత్వం దేవస్థానం అభివృద్ధి పనులతోపాటు పుష్కర ఘాట్‌పనులకు కలిపి రూ.348కోట్ల59లక్షల నిధులు విడుదల చేసినందున అన్నిశాఖల అధికారులు తమకు కేటాయించిన పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, పనుల అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అవసరమైన చోట శాఖల మధ్య సమన్వయం పెంపొందించుకుని, ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవాలని తెలిపారు. గోదావరి పుష్కరాల నిర్వహణకు భద్రాచలాన్నిఅన్నివిధాలుగా సిద్ధం చేసే లక్ష్యంతో అధికారులు సమిష్టి బాధ్యతతో పని చేసి, అభివృద్ధి పనులన్నింటినీ శ్రీరామనవమి నాటికి పూర్తి చేయాలని, శాఖల మధ్య ఏమైనసమస్యలుంటే వెంటనే కలెక్టర్, సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని, పనులు మాత్రం ఆపవద్దని ఆమె అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఈఓ దామోదర్‌రావు, ఆర్‌అండ్‌బి ఈఈ నాగేశ్వరరావు, డిపిఓ అనూష, ట్రాన్స్కో ఎస్ఈ మహేందర్, డిఎంహెచ్ఓ తుకారాంరాథోడ్, డిపిఓ భగవాన్‌రెడ్డి, తహశీల్దార్ రవికుమార్, సర్పంచ్ పూనెం కృష్ణ, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు మంజూరు చేయాలి

- నీటి కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశాలు



వికారాబాద్, నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) : వికారాబాద్ జిల్లాలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చేయూత పింఛన్ల మంజూరు ప్రక్రియ, వివిజి రామ్‌జీ ,పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. పెండింగ్‌లో ఉన్న పింఛన్ల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా పారదర్శకంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనర్హులకు పింఛన్లు మంజూరైనట్లు తేలితే సంబంధిత అధికారులపై విజిలెన్స్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వికలత్వంపై ఏవైనా అనుమానాలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రతి దరఖాస్తును పునఃపరిశీలించిన అనంతరం పూర్తి వివరాలతో సమర్పించాలని సూచించారు. పింఛన్ల అర్హతల నిర్ధారణ, మంజూరు ప్రక్రియలో ఎలాంటి తప్పులు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య పరిష్కారానికి, భూగర్భ జలమట్టం పెంపునకు వివిజి రామ్‌జీ పథకం కింద నీటి సంరక్షణ పనులు చేపట్టాలని సూచించారు. నీటి కుంటలు, బోర్‌వెల్ రీచార్జ్, ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తూ వర్షపు నీటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, జడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీఆర్డీఓ సుధీర్, అదనపు డీఆర్డీఓ నర్సింలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పురాతన కట్టడాలు, దేవాలయాల పరిరక్షణ అందరి బాధ్యత

- పానగల్ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయంలో హెరిటేజ్ వాక్ ప్రారంభించిన కలెక్టర్ బి. చంద్రశేఖర్



నల్లగొండ, నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) : పురాతన, చారిత్రక కట్టడాలు, దేవాలయాలను భావితరాలకు అందించేలా సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.బుధవారం ఇంటాక్ (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్) తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో నల్లగొండ సమీపంలోని పానగల్ ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్వహించిన హెరిటేజ్ వాక్‌ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందిన చారిత్రక ఆలయమని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు సందర్శిస్తుంటారని తెలిపారు. 12వ శతాబ్దంలో కాకతీయుల కాలంలో ఈ ఆలయం నిర్మితమైనట్లు చరిత్ర ద్వారా తెలుస్తోందన్నారు. హెరిటేజ్ వాక్ ద్వారా ఆలయ చరిత్ర, విశిష్టతను ప్రజలు మరింతగా తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.పురాతన కట్టడాల పరిరక్షణలో భాగంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇటీవల ఛాయా సోమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి బడ్జెట్ కేటాయించిన విషయాన్ని కలెక్టర్ గుర్తుచేశారు. ఇంటాక్ సంస్థ ఆధ్వర్యంలో ఆలయం వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించడం సంతోషకరమన్నారు. అంతకు ముందు కలెక్టర్ ఇంటాక్ ప్రతినిధులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడిలోని శివలింగంపై నీడ ఏర్పడే ప్రత్యేక విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు.ఇంటాక్ న్యూఢిల్లీ చైర్మన్ అశోక్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. పురాతన కట్టడాలను పునరుద్ధరించడం, వాటి చారిత్రక వైభవాన్ని కాపాడటం సంస్థ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నల్లగొండ ఇంటాక్ చాప్టర్ ప్రారంభం సందర్భంగా ఛాయా సోమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ పరిరక్షణకు ఇంటాక్ కృషి చేస్తుందని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డైరెక్టర్ అర్జున్ రావు, వెద్ కుమార్, నజ్జాద్ సాహిది, ధనుంజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- రైతులు సర్వేలో తప్పనిసరిగా పాల్గొనాలి: కలెక్టర్ మను చౌదరి



కేసర, నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) : కేసర మండలం బోగారం గ్రామంలో బుధవారం నిర్వహించిన భూ భారతి రీ-సర్వే అవగాహన సదస్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రికార్డుల ఆధునీకరణ, భూ సరిహద్దు వివాదాల పరిష్కారం, రైతులకు భూములపై స్పష్టమైన హక్కులు కల్పించడమే రీ-సర్వే లక్ష్యమని తెలిపారు. 1954 నాటి పాత రికార్డులను ప్రస్తుత సర్వే వివరాలతో సరిపోల్చి శాటిలైట్ సాంకేతికత ద్వారా భూములను డిజిటల్ విధానంలో నమోదు చేస్తామని వివరించారు. సర్వే సమయంలో సంబంధిత సర్వే నంబర్ల రైతులందరూ ప్రత్యక్షంగా హాజరై అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డీఓ నల్ల వెంకట్ రెడ్డి, అడిషనల్ డైరెక్టర్ సర్వే ఆఫ్ ల్యాండ్స్, కీసర తహసీల్దార్ యాదగిరి రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏ ఒక్క ఓటు కూడా మిస్ కావద్దు

- ఓటు నమోదు కాని వ్యక్తుల వివారాలను సంబంధిత అధికారులకు సమర్పించాలి
- అర్హులైన ప్రతి ఓటర్ ను ఓటర్ జాబితాలో చేర్చాలి
- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



యాదాద్రి భువనగిరి నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాలో పేరు నమోదు కాని అర్హులైన వ్యక్తులు తమ వివరాలను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించి, ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. బుధవారం రోజు మినీ మీటింగ్ హాల్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , రెవిన్యూ అద నపు కలెక్టర్ వెంకారెడ్డి , వివిధ పొలిటికల్ పార్టీ నాయకులతో ఎస్ ఐ ఆర్ , ఎమ్మెల్సీ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్ని కల అధికారి , జిల్లా కలెక్టర్ మాట్లడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించిన ప్రక్రియపై జిల్లా లోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు నవంబర్ 21 వరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించేందుకు గడువు పొడగించడం జరిగిందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎ ఎస్ డి డి జాబితా లో ఉన్న ఓటర్లను సంప్రదించి , వారికి అను బంధ ఫారాలను అవసరాన్ని బట్టి ప్రకటన పత్రాల సమర్పణ విధానాన్ని వివరించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరుకు తుది ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పించిందని అన్నారు. వరంగల్- ఖమ్మం-నల్లగొండ పట్ట భద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని , ఓటరు నమోదు దరఖాస్తు లను ఎప్పటికప్పుడు పరిశీలించి , అర్హులైన పట్ట భద్రులకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసు కోవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడి జీవితాలు నాశనం చేసుకోవద్దు!

- హెచ్చరించిన ములుగు ఎస్పి వెంకటేశ్వర్లు



ములుగు, నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) : పేకాట, జూదం వంటి వ్యసనాలకు అలవాటుపడి విలువైన జీవితాలను, కుటుంబ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ములుగు సబ్‌ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. పేకాటకు బానిసలై సంపాదించిన డబ్బును కోల్పోవడమే కాకుండా కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు, గొడవలు, మనశ్శాంతి కరువయ్యే పరిస్థితులు ఏర్పడతాయని హెచ్చరించారు.ములుగు జిల్లా కేంద్రంలోని సవేరా లాడ్జిలో పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి 15 మందిని అరెస్టు చేసిన నేపథ్యంలో ఆయన ఈ హెచ్చరికలు జారీ చేశారు. జూదం, పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా, వాటికి సహకరించినా ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. హోటళ్లు, లాడ్జీలు, ప్రైవేట్ ప్రదేశాల్లో జూదం నిర్వహించినా, అందుకు స్థలాలు కేటాయించినా సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం
వేములపాడు గ్రామంలో పోలీసుల రాత్రి బస



యాడికి నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :

మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో యాడికి సిఐ శ్రీనివాసులు మరియు తమ సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి బస (నైట్ హాల్ట్) కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా,ప్రజల భద్రతను పర్యవేక్షించేందుకు గాను పోలీస్ అధికారులు, సిబ్బందితో కలసి రాత్రి వేళ వీధుల్లో కాలినడకన గస్తీ (నైట్ పెట్రోలింగ్) నిర్వహించారు. స్థానిక ఎన్నికల సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా ఉంచడంతో పాటు, స్థానిక ప్రజలకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.అనంతరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలోనే పోలీస్ అధికారులు మరియు సిబ్బంది రాత్రి నిద్రించారు.ప్రజాభద్రతకు ప్రాధాన్యమిస్తూ,నేరాల నివారణే లక్ష్యంగా గ్రామాల్లో ఇటువంటి రాత్రి బస కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.పోలీసు వ్యవస్థ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు, గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ఈ రాత్రి బస ఎంతగానో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. శాంతిభద్రతల పట్ల ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా కోరారు.



ఎన్నినో పై ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి
: అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి
- రైతులు ఆరుతడి పంటల సాగుచేసేలా చైతన్యం తేవాలి
- త్రాగు నీటికి ఇబ్బందులు రావద్దు
- అధికారులతో సమీక్ష చేసిన అదనపు కలెక్టర్



ఖమ్మం, నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) : ఎన్నినో ప్రభావం దృష్ట్యా జిల్లాలో రానున్న కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీటి సరఫరా, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పంటల సాగు, తాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ ప్రణాళికలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, అన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పాలేరు రిజర్వాయర్ లో 3 నెలలకు, వైరా రిజర్వాయర్ లో 5 నెలలకు నీటి నిల్వలు ఉన్నాయన్నారు. నీటి లభ్యత తగ్గనున్న దృష్ట్యా, ఉన్న నీటిని తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వరి, మొక్కజొన్న వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలను వేయకుండా రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలు, ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. రైతుల్లో చైతన్యం తీసుకురావడానికి కళాజాత బృందాల ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని, అలాగే వాయిస్ మెసేజ్‌ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వి. మధుసూదన్, జిల్లా పశు సంవర్ధక అధికారి డా. పురందర్, విద్యుత్ శాఖ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, ఆర్డబ్ల్యూఎస్ ఇఇ వాణిశ్రీ, వ్యవసాయ, గ్రామీణ నీటి సరఫరా, మున్సిపల్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఆధునిక వైద్య సేవలకు మరింత చేరువగా వెస్టా డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభం కావడం సంతోషకరం.



అనంత పురం బ్యూరో నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) : ఈరోజు కర్ణాటక రాష్ట్రం బళ్లారి హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఇన్ఫంట్రీ రోడ్‌లో ఏర్పాటు చేసిన వేస్టా డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎం పి అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఎంఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుటుంబ మరియు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ , హిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారథి , రాయదుర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి గఎం, ూణజజ చైర్మన్ కేశవరెడ్డి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సంధిరెడ్డి శ్రీనివాస్ స్థానిక డిప్యూటీ మేయర్ జానకమ్మ నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి కమిటీ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు. వెస్టా డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన డాక్టర్ ఆకాష్ ని ఈ సందర్భంగా అభినందించాను. బళ్లారితో పాటు రాయదుర్గం, బొమ్మనహాళ్, డి.హిరేహాళ్, విడపనకల్లు తదితర సరిహద్దు ప్రాంతాల ప్రజలకు తక్కువ ఖర్చుతో ఆధునిక వైద్య పరీక్షలు అందుబాటులోకి రావడం ఎంతో ఉపయోగకరం. సి టి స్కాన్, అల్ట్రాసౌండ్, క్యాన్సర్ నిర్ధారణతో పాటు వివిధ రకాల ఆధునిక వైద్య పరీక్షలు అందుబాటులో ఉండటం వల్ల వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స పొందేందుకు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంజీవని, ఆయుష్మాన్ భారత్ వంటి ఆరోగ్య పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తున్నాయి.ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, అందుబాటులో ఉన్న వైద్య సేవలు ప్రభుత్వ ఆరోగ్య పథకాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను.

పదవులు అలంకారప్రాయాలు కాదు..
ప్రజలకు సేవ చేసేందుకు లభించిన బాధ్యతలు
ఎంపీ కేశినేని చిన్ని.నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ నాయకులతో ఎంపీ చిన్ని భేటీ



విజయవాడ బ్యూరో, నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :

విజయవాడలోని ఎంపీ కార్యాలయంలో ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే పదవుల సంబరాలు, రాజకీయ హడావుడికే పరిమితం కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల ప్రత్యేకత అని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఆచరణలోకి తీసుకువచ్చే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఆయన సూచించారు. నందిగామ నియోజకవర్గంలోని చందర్లపాడు మండలానికి చెందిన నూతనంగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఆయన అభినందనలు తెలియజేశారు.ఈ భేటీలో కేవలం ఎన్నికల విజయానికి సంబంధించిన అభినందనలు, శుభాకాంక్షలకే పరిమితం కాకుండా చందర్లపాడు మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులు, అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రజాప్రతినిధులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు అందించిన విజయాన్ని ఒక బాధ్యతగా స్వీకరించాలని, ప్రజలు మనకు అప్పగించిన పదవులు వ్యక్తిగత హోదా, ప్రతిష్ఠ కోసం కాకుండా ప్రజలకు సేవ చేసేందుకు లభించిన అవకాశాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే పదవుల సంబరాలు చేసుకోవడం కంటే, ప్రజలు మనపై పెట్టుకున్న ఆశలు, ఆకాంక్షలను గుర్తించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ఎంతో ముఖ్యమన్నారు. నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు బాధ్యతలు స్వీకరించిన తొలిరోజు నుంచే ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రజాప్రతినిధుల వద్దకు వచ్చినప్పుడు వారికి భరోసా కల్పించాలని, ప్రతి సమస్యను బాధ్యతగా స్వీకరించి పరిష్కారం దిశగా ముందుకు వెళ్లాలని అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు, స్థానికంగా ఎదురవుతున్న ఇతర సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు పదవులు చేపట్టిన వెంటనే తమ మండలంలోని సమస్యలను గుర్తించి, వాటిని తన దృష్టికి తీసుకురావడం అభినందనీయమని ఎంపీ చిన్ని అన్నారు. ప్రజా సమస్యల పట్ల ప్రజాప్రతినిధులకు ఉన్న బాధ్యత, ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.చందర్లపాడు మండలంలోని గ్రామాల అభివృద్ధికి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి, అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీ చిన్ని ఆకాంక్షించారు. గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమై, వారి అవసరాలను తెలుసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రజల ఆశీస్సులతో లభించిన విజయాన్ని ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావించి, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎంపీ చిన్ని పిలుపునిచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారానికి, చందర్లపాడు మండల సమగ్ర అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు.

మున్సిపల్ ఎన్నికల్లో విజయంతో బాధ్యత మరింతగా పెరిగింది
-రానున్న కాలంలో మరింతగా సంక్షేమం, అభివృద్ధి చేస్తాం. ఎమ్మెల్యే గద్దె



విజయవాడ బ్యూరో, నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో విజయం సాధించారని, ఈ విజయంతో తమపై మరింతగా బాధ్యత పెరిగిందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. రానున్న కాలంలో సంక్షేమం, అభివృద్ధిని మరింతగా అందించి 2029లో జరిగే అసెంబ్లీ కూడా కూటమి పార్టీలు విజయం సాధిస్తాయన్నారు. బుధవారం ఉదయం తూర్పు లోని 27వ డివిజన్ లో ఎమ్మెల్యే గద్దె పర్యటించారు. స్థానికులను అడిగి వారి సమస్యలను ఆయన స్వయంగా తెలుసుకొని వాటిని పరిష్కరించాల్సిందిగా కార్పొరేషన్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం గతంలో డివిజన్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన సుంకర రాజాకు అండగా ఉండేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే గద్దె ఆమెకు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో విజయం సాధించారని చెప్పారు. టీడీపీ, జనసేన, బిజేపీ పార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్లను చూసి ప్రతిపక్ష పార్టీల నాయకుల గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయని తెలిపారు. రాష్ట్రం మొత్తం ప్రతిపక్ష పార్టీలను ఏవిధమైన ఇబ్బందులకు గురిచేయకుండా ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని సమంగా అందించామని, అందుకు కృతజ్ఞతగా ఇప్పుడు ఈ ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించారని పేర్కొన్నారు. ఈవీఎం మిషన్ల వల్లనే గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులు గెలిచారని, నిన్నటి వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారని, బ్యాలెట్ పేపర్ ద్వారా జరిగిన ఎన్నికల్లో కూడా కూటమి పార్టీ అభ్యర్థులు విజయం సాధించారని తెలిపారు. ఈ ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థుల విజయం ద్వారా తమపై బాధ్యత మరింతగా పెరిగిందని గద్దె అన్నారు. రానున్న మూడు సంవత్సరాల కాలంలో మరింతగా సంక్షేమాన్ని, అభివృద్ధిని అందించి 2029వ సంవత్సరం జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ప్రజల మద్దతును పొందుతామని చెప్పారు. ప్రజల కష్ట సుఖాల్లో ఇంటికి పెద్ద కొడుకు మాదిరిగా పాలుపంచుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో చెప్పారని, చెప్పినట్లుగా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అండగా ఉంటున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు మరిన్ని ఎక్కువ సంక్షేమ పథకాలను అమలు చేసేలా కేంద్రంలోని బీజేపీ సహాయం అందించాల్సిందిగా ఎమ్మెల్యే కోరారు. ట్రిపుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి మరింత వేగవంతం చేస్తామని అన్నారు. ఇటీవల కార్పొరేటర్ గా ఎన్నికైన కిరణ్ మాట్లాడుతూ ప్రజలను నిత్యం అందుబాటులో ఉంటూ వారికి సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తామన్నారు. కార్పొరేటర్ గా ఎన్నికైన గొరిపర్తి నామేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందడం వల్లనే ప్రజలు కూటమి పార్టీ అభ్యర్థులను ఓట్లు వేసి గెలిపించారని, ఇదే విధంగా ప్రజలకు మేలు చేస్తామన్నారు. జనసేన నాయకులు జయ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ఎమ్మెల్యేగా మూడు సార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించారని, కార్పొరేటర్‌గా గెలిచిన తాము ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె సహకారంతో డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గా ఎన్నికైన గూడ్డేటి లక్ష్మీ హర్ష, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, కూటమి నాయకులు గల్లా శ్రీను, జయ, వెన్నా శంకర్, ఈశ్వర్‌రావు, ఎస్‌కే.జిదాన్, రవి, కుమారి తదతరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగానికి అందించిన సేవలు చిరస్మరణీయం



-- ఎంపీ కేశినేని చిన్ని

విజయవాడ బ్యూరో, నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్) :

విజయవాడ లోని ఎంపీ కార్యాలయంలో భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫారుక్ షుబ్లీ, టీడీపీ మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ ఫైజాన్‌తో పాటు పలువురు మైనారిటీ నాయకులు పాల్గొని మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ భారతదేశ విద్యారంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం దేశ విద్యావ్యవస్థకు బలమైన పునాదులు వేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. దేశంలో తొలి ఐఐటీ అయిన ఖరగ్‌పూర్ ఐఐటీ ఏర్పాటుతో పాటు ఉన్నత విద్యా సంస్థల అభివృద్ధికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా భారతీయ యువత అత్యున్నత స్థానాల్లో నిలుస్తూ దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేయడానికి ఆనాడు ఆయన వేసిన విద్యా పునాదులే స్ఫూర్తిగా నిలుస్తున్నాయని అన్నారు.విజయవాడ నగరం గత వందేళ్లుగా మతసామరస్యం, సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోందని ఎంపీ చిన్ని పేర్కొన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులు దసరా, రంజాన్, క్రిస్మస్ వంటి పండుగలను పరస్పర గౌరవం, స్నేహభావంతో కలిసిమెలిసి జరుపుకోవడం విజయవాడ ప్రత్యేకత అని అన్నారు. నగర అభివృద్ధిలో ముస్లిం సోదరుల భాగస్వామ్యం, వారి సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు.కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పనిచేయడం వల్లే విజయవాడ నగరం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. గత ఎన్నికల్లో ప్రజలు కులమతాల కంటే అభివృద్ధి, సంక్షేమం, తమ పిల్లల భవిష్యత్తుకు ప్రాధాన్యతనిచ్చారని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంపై విశ్వాసంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి ప్రజలు అధికారం అప్పగించారని పేర్కొన్నారు.పేద మైనారిటీ కుటుంబాల విద్యా, ఆర్థిక అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం హుర్తి అండగా ఉంటుందని ఎంపీ చిన్ని స్పష్టం చేశారు. ముఖ్యంగా మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉన్నత విద్యావకాశాలు కల్పించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్ ఆధ్వర్యంలో పేద ముస్లిం విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 300 మంది ముస్లిం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఐఐటీ, మెడికల్ ప్రవేశ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ప్రత్యేక కోచింగ్ అందించనున్నట్లు వెల్లడించారు. ఒక్కో బ్యాచ్‌లో 150 మంది చొప్పున రెండు బ్యాచ్‌లుగా విద్యార్థులకు శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.ప్రముఖ ఐఐటీ, మెడికల్ కోచింగ్ సంస్థల ద్వారా నాణ్యమైన శిక్షణ అందించి, పేద విద్యార్థులు సైతం జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చాటేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదని ఎంపీ చిన్ని ఆకాంక్షించారు. ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, మెరుగైన శిక్షణ, ఉన్నత అవకాశాలు అందుబాటులో ఉండాలని అన్నారు. ముస్లిం సోదర సోదరీమణుల విద్యా, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. విజయవాడలో మతసామరస్యాన్ని మరింత బలోపేతం చేస్తూ, అన్ని వర్గాల ప్రజలకు సమాన అభివృద్ధి అవకాశాలు కల్పించే దిశగా ప్రజాప్రతినిధులు, మైనారిటీ నాయకులు, సామాజిక సంస్థలు సమష్టిగా కృషి చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు.విద్య, ఐక్యత, అభివృద్ధి, సంక్షేమం అనే లక్ష్యాలతో ముందుకు సాగినప్పుడే సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.

మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



- అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, నవంబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్) : మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, పొన్నూరు మున్సిపాలిటీలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మతో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు.

నవంబర్ 26న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని, సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్‌లు, కార్డన్ సెర్చ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీ, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై అప్రమత్తంగా ఉండాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్, ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్ఓ ఖాజావలి, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, డీపీఓ నాగ సాయికుమార్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనసైనికులకు వైసీపీ లీగల్ టీమ్ స్ట్రాంగ్ వార్నింగ్!



- జగన్ కుటుంబంపై అసభ్య వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవన్న వైసీపీ
- అసభ్యకర ఆడియోల ప్రచారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న పార్టీ లీగల్ సెల్

అమరావతి, నవంబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్) : వైసీపీ అధినేత జగన్, ఆయన కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారంటూ జనసైనికులపై వైసీపీ లీగల్ సెల్ మండిపడింది. పరిమితులు దాటి ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని గట్టి హెచ్చరికలు జారీ చేసింది.

పవన్ కల్యాణ్ మూడో భార్యకు విడాకుల నేపథ్యంలో, జనసేన కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా అన్ని రకాల హద్దులు దాటి ప్రవర్తిస్తున్నారని లీగల్ సెల్ ఆరోపించింది. జగన్, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని అత్యంత జుగుప్సాకరమైన, దారుణమైన భాషను ఉపయోగిస్తున్నారని తెలిపింది. అంతటితో ఆగకుండా, ఆ వ్యాఖ్యలను రికార్డు చేసి వివిధ సామాజిక మాధ్యమాల్లో ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ఈ పరిణామాలను పార్టీ లీగల్ విభాగం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని స్పష్టం చేసింది. అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం, నిన్న ఎక్స్ (ట్విట్టర్) వేదికగా 'స్పేస్' నిర్వహించి జగన్ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని గోవాద రాఘవేంద్ర నాయుడుగా గుర్తించినట్లు వెల్లడించింది.

సదరు వ్యక్తి @Glass19Mar, @TYSON21AP, @werty1234up వంటి వివిధ ఖాతాల పేర్లతో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు గుర్తించామని, అతనిపై త్వరలోనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లీగల్ సెల్ స్పష్టం చేసింది. భావప్రకటన స్వేచ్ఛ పేరుతో వ్యక్తిగత దూషణలకు దిగడం, అసభ్యకర పోస్టులతో సమాజంలో విషం చిమ్మే ప్రయత్నం చేస్తే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ లీగల్ విభాగం హెచ్చరించింది.

మంత్రి సత్యకుమార్ విజ్ఞప్తిపై సీఎం తక్షణ స్పందన

- రెండు జిల్లాలకు రూ.కోటి విలువైన 250 టన్నుల పశుగ్రాసం సరఫరాకు ఆదేశాలు

అమరావతి, నవంబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్) : ఎల్‌నినో ప్రభావంతో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో తీవ్రంగా నెలకొన్న పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి, రెండు జిల్లాల్లో కొరత ఉన్న ప్రాంతాలకు పశుగ్రాసం సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రూ.కోటి విలువైన 250 మెట్రిక్ టన్నుల పశుగ్రాసాన్ని తక్షణమే అందించనున్నట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్ర వెల్లడించారు.

నవంబర్ 9న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పశువులకు మేత కొరత ఏర్పడితే రైతులు, పశుపోషకుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. పశుసంపదను కాపాడేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించి, అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అధికారుల అంచనాల ప్రకారం శ్రీ సత్యసాయి జిల్లాలోని 363 రెవెన్యూ గ్రామ సచివాలయాల పరిధిలో పశుగ్రాసం కొరత నెలకొంది. జిల్లాలో 3.56 లక్షల ఆవులు, గేదెలు, 32.49 లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయి. ప్రస్తుతం 2.39 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందుబాటులో ఉండగా, 90 రోజుల అవసరాలకు 4.58 లక్షల మెట్రిక్ టన్నులు కావాల్సి ఉంది. దీంతో 2.19 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఏర్పడింది.

అనంతపురం జిల్లాలోనూ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. జిల్లాలోని 362 రెవెన్యూ గ్రామ సచివాలయాలకుగాను 293 పరిధుల్లో పశుగ్రాసం కొరతను అధికారులు గుర్తించారు. జిల్లాలో 3.50 లక్షల ఆవులు, గేదెలు, 8.84 లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయి. ప్రస్తుతం 3.87 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందుబాటులో ఉండగా, 90 రోజుల అవసరాలు 12.72 లక్షల మెట్రిక్ టన్నులుగా అంచనా వేశారు. ఫలితంగా 8.84 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఉన్నట్లు గుర్తించారు.

రెండు జిల్లాల్లోనూ కొరత తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎండుగడ్డి, పచ్చిగడ్డి, పశుదాణా సరఫరాకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు అమరేంద్ర తెలిపారు. అత్యధిక కొరత ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యమిస్తూ అవసరాలకు అనుగుణంగా మేత అందిస్తామని పేర్కొన్నారు.

పశుసంపదను కాపాడటం, పశుపోషకుల జీవనోపాధికి భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మేత కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు.

15టి విలువైన 250 టన్నుల పశుగ్రాసం సరఫరాకు ఆదేశాలు : ఎల్‌నినో ప్రభావంతో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో తీవ్రంగా నెలకొన్న పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు రాష్ట్రప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి, రెండు జిల్లాల్లో కొరత ఉన్న ప్రాంతాలకు పశుగ్రాసం సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రూ.కోటి విలువైన 250 మెట్రిక్ టన్నుల పశుగ్రాసాన్ని తక్షణమే అందించనున్నట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్ర వెల్లడించారు.

నవంబర్ 9న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం : ఎమ్మెల్యే నసీర్

- పీ ఫోర్ ద్వారా పేదలకు మేలు జరిగేలా కార్యక్రమాలు
- మహిళకు కుట్టు మిషన్ అందజేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు, నవంబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్): మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో మహిళకు ఎమ్మెల్యే నసీర్ కుట్టుమిషన్ అందజేశారు. నియోజకవర్గంలోని 11వ వార్డుకు చెందిన షేక్. షకీరా గతంలో తనకు స్వయ ఉపాధి కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే నసీర్ కు వినతిపత్రం అందజేశారు. పీ ఫోర్ కార్యక్రమం ద్వారా ఆమెకు సహకారం అందిస్తానని అప్పట్లో ఎమ్మెల్యే హామీ ఇచ్చారు ఈ మేరకు షేక్ షకీరాకు కుట్టుమిషన్ అందించి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటుగా నిలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ ఫోర్ పథకం ద్వారా మహిళలకు స్వయం ఆర్థిక అభివృద్ధి సాధించేలా చేయూత అందిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పీ ఫోర్ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాలకు మేలు జరిగేలా సీఎం చంద్రబాబు నాయుడు కార్యక్రమాన్ని రూపొందించారని చెప్పారు. దాతల సహకారం ద్వారా పేదల జీవనోపాధికి కృషి చేస్తున్నామని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ అవకాశాల కల్పించడమే కాకుండా మహిళలు తమ కాళ్ళపై నిలబడే విధంగా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

ఎన్నికల భద్రతపై పోలీసుల కవాతు

- పిడపర్రు, దంతలూరు గ్రామాలతోపాటు పొన్నూరులో ఫ్లాగ్ మార్చ్



గుంటూరు, నవంబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్): రానున్న గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపడుతోంది. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు కొల్లిపర మండలంలోని పిడపర్రు, దంతలూరు గ్రామాలతోపాటు పొన్నూరు పట్టణంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

తెనాలి రూరల్ సీఐ ఎస్.కె. నయాబ్ రసూల్, కొల్లిపర ఎస్ఐ ఎన్.సి. ప్రసాద్, తెనాలి రూరల్ ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పిడపర్రు, దంతలూరు గ్రామాల్లో కవాతు నిర్వహించారు.


అదేవిధంగా పొన్నూరు పట్టణ సీఐ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో సాయంత్రం పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్ మార్చ్ ఎంఆర్ఓ కార్యాలయం, గాంధీ చౌక్, ఐలాండ్ సెంటర్, జీబీసీ రోడ్డు, నిడుబ్రోలు ఫ్లైఓవర్, అంబేద్కర్ కాలనీ, చర్చి రోడ్డు, విద్యానగర్, జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్ మీదుగా సాగి తిరిగి పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది.

ఈ సందర్భంగా ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పిస్తూ ఎలాంటి భయాందోళనలు, ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు.

ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రత కల్పిస్తామని, రౌడీషీటర్లను బైండోవర్ చేయడంతోపాటు పోలింగ్‌కు ఆటంకం కలిగించే వ్యక్తులను ముందుగానే గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు భరోసా ఇచ్చారు.

'ఆంధ్రా' అద్భుతం.. ప్రగతి, సంప్రదాయాల సమ్మేళనంగా సీఐఐ సదస్సు



విశాఖపట్నం, నవంబరు 12 (జర్నలిస్ట్ ఫైల్): సాగర తీర నగరం విశాఖపట్నంలో గురువారం ఘనంగా ప్రారంభమైన భారత పరిశ్రమల సమాఖ్య - భాగస్వామ్య సదస్సు వేదిక సరికొత్త శోభను సంతరించుకుంది. ఆహ్లాదకరమైన వాతావరణం, సరికొత్త ఆలోచనలకు ఊపిరిలూదేలా సదస్సు ప్రాంగణాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. గురువారం ఉదయం సదస్సును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ప్లీనరీ హాల్, మూడు సమావేశ మందిరాలు, పెట్టుబడులకు అంకురార్పణ చేసే వ్యవస్థాపక మందిరంతో పాటు ఆంధ్రప్రదేశ్ ఘన కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఏర్పాటు చేసిన ప్రదర్శన సందర్శకులను కట్టిపడేస్తోంది. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, నోరూరించే వంటకాలు, చేనేత-కలంకారీ హస్తకళలు, పర్యాటక సొబగులు, పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడి అవకాశాలను కళ్ళకు కట్టినట్లు ఆవిష్కరించారు.

కట్టిపడేస్తున్న చేనేత, కలంకారీ వైభవం : చేనేత, కలంకారీ కళలకు ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పట్టు, కలంకారీ వస్త్రాలను ప్రదర్శించారు. వస్త్రాల తయారీ విధానాన్ని వివరించడం సందర్శకులను ఆకట్టుకుంటోంది. వీటితో పాటు విభిన్న రకాల అందమైన తివాచీలు (కార్పెట్లు) చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

'హాల్ ఆఫ్ ఫేమ్' - 'టేస్ట్ ఆఫ్ ఆంధ్ర' : వివిధ రంగాల్లో విశేష సేవలందించి, రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చిన మహనీయుల కీర్తిని చాటుతూ 'హాల్ ఆఫ్ ఫేమ్' పేరుతో లబ్ధప్రతిష్ఠుల చిత్రపటాలను ఏర్పాటు చేశారు. మరోవైపు, ఆంధ్రా రుచులను ప్రపంచానికి పరిచయం చేసే 'టేస్ట్ ఆఫ్ ఆంధ్రా' విభాగం సందర్శకులకు సరికొత్త అనుభూతిని పంచుతోంది. ప్రపంచ ప్రఖ్యాత అరకు కాఫీ ఘుమఘుమలతో పాటు, వంటకాలకు మరింత రుచిని జోడించే సుగంధ ద్రవ్యాలు, ప్రత్యేక మసాలా దినుసులు ప్రదర్శనలో ఉంచారు.

డిజిటల్ సొబగులతో పర్యాటకం, హస్తకళలు : ఆంధ్రప్రదేశ్ పర్యాటక అందాలను ఆధునిక డిజిటల్ విధానంలో ఆవిష్కరించిన తీరు అద్భుతంగా ఉంది. ఎకో టూరిజం, ఆధ్యాత్మిక, వారసత్వ, సాంస్కృతిక పర్యాటక రంగాలతో పాటు రాష్ట్ర సంప్రదాయ జీవనశైలిని కళ్ళకు కట్టినట్లు చూపిస్తున్నారు. అలాగే, 'మేకర్స్ స్టూడియో' విభాగంలో కొలువుదీరిన పెన్ కలంకారీ, కొండపల్లి బొమ్మలు, సవర ఆదివాసీ కళాకృతులు, ప్రఖ్యాత తోలుబొమ్మలు చూడముచ్చట గొలుపుతున్నాయి.

పెట్టుబడుల స్వర్ణాంధ్రగా ఆంధ్రప్రదేశ్ : ఆధునిక యుగంలో రాష్ట్రం సాధిస్తున్న శరవేగవంతమైన పారిశ్రామిక అభివృద్ధిని ఈ ప్రదర్శన ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా ఆహార శుద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్), గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా, ఉక్కు (స్టీల్), ఉపాధి కల్పన రంగాల్లో రాష్ట్ర ప్రగతిని వివరించారు. పెట్టుబడులకు ఉన్న విస్తృత అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలను స్పష్టంగా తెలియజేస్తూ "పెట్టుబడుల స్వర్గసీమ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టండి" అనే స్ఫూర్తిని పారిశ్రామికవేత్తల్లో నింపేలా ఈ ప్రదర్శన విజయవంతంగా సాగుతోంది.

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అరెస్ట్ అక్రమం,అన్యాయం

- అక్రమాలు చేసిన అధికారులను వదిలేసి ఆయనపై కక్ష సాధింపా!
- బ్యాలెట్ బాక్సును కాపాడినందుకు జైలుకు పంపడం సిగ్గు చేటు
- వైయస్సార్‌సీపీ నాయకుల ఫైర్
- గుంటూరు జైలులో ఉన్న వైయస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించిన పార్టీ నాయకులు



గుంటూరు, నవంబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్):ఎన్నికల సమయంలో బ్యాలెట్ బాక్సును అక్రమంగా తరలించే ప్రయత్నాన్ని అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయించి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని జైలుకు పంపడం కూటమి ప్రభుత్వ కక్షసాధింపు రాజకీయాలకు పరాకాష్ట అని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆక్షేపించారు.

గుంటూరు సబ్‌జైలులో ఉన్న వైయస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని పార్టీ ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, కల్పలతారెడ్డి, తోట త్రిమూర్తులు పరామర్శించగా.. వారితో పాటు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, సిపాయి సుబ్రహ్మణ్యం, కేఆర్‌జే భరత్, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ యాదవ్, రూహుల్లా, మంగమ్మ, ఇసాక్ బాషా, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, రామచంద్రారెడ్డి తదితరులు కూడా జైలు వద్దకు వెళ్లారు.

అనంతరం మాజీ మంత్రి అంబటి రాంబాబుతో కలిసి వారు జైలు బయట మీడియాతో మాట్లాడారు.

ఎన్నికల అక్రమాలపై ప్రశ్నిస్తే కేసులు, అరెస్టులతో గొంతు నొక్కాలని చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, పోలీసు వ్యవస్థను రాజకీయ కక్ష సాధింపులకు వాడుకుంటోందని వైయస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు.

జైలులో ఉన్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి చట్టపరంగా దక్కాల్సిన కనీస సౌకర్యాలు, రక్షణ కూడా కల్పించడం లేదని వారు తెలిపారు.

అప్పిరెడ్డిపై మంత్రి లోకేష్, కేంద్ర మంత్రి పెమ్మసాని కుట్రలు:అంబటి రాంబాబు, మాజీ మంత్రి

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని అక్రమ కేసులో ఇరికించి గుంటూరు సబ్‌జైలులో పెట్టిన నేపథ్యంలో ఆయనకు సంఘీభావం తెలిపేందుకు మేమంతా వచ్చాము. ఇది పూర్తిగా తప్పుడు కేసు. అప్పిరెడ్డిని గుంటూరులో ఉంచడానికి కూడా ఇష్టపడకుండా రాజమండ్రి లేదా నెల్లూరు జైలుకు తరలించాలని జైలు అధికారులు కోర్టును ఆశ్రయించడం మరింత దారుణం. ఒక ఎమ్మెల్సీకి జైలులో కనీస భద్రత, చట్టప్రకారం కల్పించాల్సిన సౌకర్యాలు కూడా కల్పించలేమని అధికారులు చెప్పడం దారుణం. దీనివెనుక లోకేష్, పెమ్మసాని ఒత్తిళ్లు ఉన్నాయి.

బ్యాలెట్ బాక్సును వ్యాన్ నుంచి ఎందుకు దించారు, ఎలాంటి భద్రత లేకుండా ఎందుకు బయటకు తీసుకొచ్చారు అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదు. బాక్సును కాపాడేందుకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులకు జైలు శిక్షలు, బాక్సును పగలగొట్టేందుకు ప్రయత్నించిన వారిపై మాత్రం చర్యలు లేకపోవడం కూటమి ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని బయటపెడుతోంది. 57వ వార్డులో జరిగిన బ్యాలెట్ బాక్సు విధ్వంసం, పోలీసుల వ్యవహారశైలిపై కూడా సమగ్ర విచారణ జరపాలని ఎస్పీకి ఫిర్యాదు చేస్తాం. అప్పిరెడ్డిపై పెట్టిన తప్పుడు కేసును ఎత్తివేయడంతో పాటు, పక్షపాతంగా వ్యవహరిస్తున్న దర్యాప్తు అధికారిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నాము.

అక్రమాలను అడ్డుకున్న అప్పిరెడ్డిపై కేసు పెట్టడం హేయం:తోట త్రిమూర్తులు. ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని అక్రమ కేసులో ఇరికించి జైలుకు పంపడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిది. ఎన్నికల సమయంలో బ్యాలెట్ బాక్సును తీసుకెళ్తున్న వ్యాన్‌ను నల్లపాడు పరిధిలో ఆపి, అందులో నుంచి బాక్సును ఒక సెక్యూరిటీ సిబ్బంది బయటకు తీసుకురావడాన్ని స్థానికులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్తించి అడ్డుకున్నారు. బ్యాలెట్ బాక్సును ఎందుకు బయటకు తీస్తున్నారని ప్రశ్నించిన ప్రజలపై పోలీసులు లాఠీచార్జి చేయడం, అక్కడికి వచ్చిన లేళ్ల అప్పిరెడ్డిని అదుపులోకి తీసుకోవడం దారుణం. ఈ ఘటనలో అసలు తప్పు చేసిన పోలింగ్ సిబ్బందిపై, భద్రత కల్పించడంలో విఫలమైన అధికారులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, అక్రమాలను అడ్డుకున్న వారిపైనే హత్యాయత్నం సహా తీవ్రమైన సెక్షన్లతో కేసులు పెట్టారు. రాత్రి వరకు ఇది చిన్న గొడవేనని చెప్పిన అధికారులు, తెల్లవారేసరికి హత్యాయత్నం, దోపిడీ వంటి తీవ్రమైన సెక్షన్లు ఎలా పెట్టారో సమాధానం చెప్పాలి. లేళ్ల అప్పిరెడ్డి ఒక ప్రజాప్రతినిధి, ప్రస్తుత ఎమ్మెల్సీ. అయినప్పటికీ ఆయన పట్ల జైలు అధికారులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకరం. అప్పిరెడ్డిని జైలులో పెట్టడమే కాకుండా అక్కడ కూడా ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలు చేయడం కూటమి ప్రభుత్వ కక్షసాధింపు రాజకీయాలకు నిదర్శనం.

అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నట్లు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారు.

తప్పు చేసిన అధికారులను వదిలేసి అప్పిరెడ్డిపై అక్రమ కేసులు:వరుదు కళ్యాణి. ఎమ్మెల్సీ

ఎలాంటి తప్పు చేయని ఒక ఎమ్మెల్సీని అక్రమ కేసులో ఇరికించి రిమాండ్ ఖైదీగా జైలులో పెట్టడం దుర్మార్గం. ఎన్నికల సమయంలో వెంగళాయపాలెంలో పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సును తరలిస్తున్న వ్యాన్ నుంచి ఒక బాక్సును బయటకు తీసుకురావడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. బ్యాలెట్ బాక్సును మార్చే ప్రయత్నం జరుగుతోందనే అనుమానంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు దాన్ని అడ్డుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడే ప్రయత్నం చేశారు. తప్పు చేసిన పోలింగ్ అధికారులను, భద్రత కల్పించని పోలీసులను వదిలేసి, తప్పును ప్రశ్నించిన నాయకులపై కేసులు పెట్టడం కూటమి ప్రభుత్వ దుర్మార్గపు వైఖరికి నిదర్శనం. నామినేషన్ల నుంచి పోలింగ్, కౌంటింగ్ వరకు అనేక అక్రమాలకు పాల్పడుతూ మహిళలను సైతం వేధించిన ప్రభుత్వం ఇప్పుడు ప్రశ్నించిన వారిని జైలుకు పంపిస్తోంది. ఇది అత్యంత హేయం.

బ్రహ్మంగారిమఠం జడ్పీటీసీగా విజయం సాధించిన నాగిపోగు పుల్లయ్య



- ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు ఘన సత్కారం

బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్):బ్రహ్మంగారిమఠం మండల జడ్పీటీసీ ఎన్నికల్లో విజయం సాధించిన నాగిపోగు పుల్లయ్య గురువారం బ్రహ్మంగారిమఠం టీడీపీ కార్యాలయంలో మైదుకూరు ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కి శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

రెండేళ్లలో దేశీయ పౌర విమానం గగనవిహారం



- ఉడాన్-2 కింద మరో 100 విమానాశ్రయాలు, 200 హెలిపోర్టులు
- విమానయాన రంగంలో ఏపీకి ప్రత్యేక ప్రాధాన్యం
- సీఐఐ భాగస్వామ్య సదస్సులో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

విశాఖపట్నం, నవంబర్ 12 విశాఖపట్నం : భారత పౌర విమానయాన రంగంలో మరో కీలక ముందడుగు పడనుందని, వచ్చే రెండేళ్లలో పూర్తిగా దేశీయంగా తయారైన పౌర విమానం గగనవిహారం చేయనుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఉడాన్-2 పథకం కింద 2036 నాటికి దేశంలో మరో 100 విమానాశ్రయాలు, 200 ఆధునిక హెలిపోర్టులను నిర్మించనున్నట్లు ప్రకటించారు.

విశాఖపట్నంలో గురువారం ప్రారంభమైన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో నిర్వహించిన ప్రత్యేక ప్లీనరీలో మంత్రి ప్రసంగించారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 166కు చేరిందన్నారు. ఉడాన్ పథకం విమాన ప్రయాణాన్ని సామాన్యులకు చేరువ చేసిందని, వార్షిక విమాన ప్రయాణికుల సంఖ్య 25 కోట్లకు పెరిగిందని తెలిపారు. రూ. 30 వేల కోట్ల బడ్జెట్‌తో ఉడాన్ రెండో దశను అమలు చేస్తున్నట్లు వివరించారు.

విమానాశ్రయాల్లో డిజి యాత్ర వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టడం వల్ల ప్రయాణికుల ప్రవేశ సమయం 90 సెకన్ల నుంచి 20 సెకన్లకు తగ్గిందని చెప్పారు. విమానయాన రంగంలో అనుసంధానం, సామర్థ్యం, పోటీతత్వం పెంపునకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ విమానయాన రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని మంత్రి పేర్కొన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్ణీత గడువుకు ఆరు నెలల ముందే పూర్తి చేసే దిశగా సాగుతున్న పనులను ప్రశంసించారు. అనంతపురం జిల్లా లేపాక్షి సమీపంలో ఏరోస్పేస్, డిఫెన్స్ సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రకాశం బ్యారేజీ, శ్రీశైలం, హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ ప్రాంతాల మధ్య నీ ఫ్లేన్ సేవలు ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

విమాన విడిభాగాల తయారీ, విమానాల మరమ్మతులు-నిర్వహణ (ఎంఆర్ఓ), డ్రోన్లు, ఎయిర్ ట్యాక్సీల (ఈవీటీఓఎల్) రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు. పరిశ్రమలు, యువ పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అనంతరం జరిగిన చర్చలో సీఐఐ జాతీయ పౌర విమానయాన కమిటీ కో-చైర్, కాంటినెంటల్ క్యారియర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వైభవ్ వోహ్రా, జోధ్‌బీర్ సింగ్ సచ్‌దేవా, కేపీఎంజీ భాగస్వామి అనుభవ్ కుమార్, బోయింగ్ ఇండియా అండ్ సౌత్ ఏషియా హెడ్ ఆఫ్ స్ట్రాటజీ అండ్ గవర్నమెంట్ పాలసీ డాక్టర్ అభయ్ పషికర్, సీఎస్ఐఆర్--నేషనల్ ఏరోస్పేస్ లాబొరేటరీస్ డైరెక్టర్, యుఎన్ఈపీ సీనియర్ సలహాదారు సుధీర్ పేర్ల తదితరులు పాల్గొన్నారు. దేశంలో విమాన అనుసంధానత విస్తరణ, విమానాశ్రయాలు--విమానయాన సంస్థల సామర్థ్యం పెంపు, అంతర్జాతీయ పోటీతత్వం వంటి అంశాలపై చర్చించారు.

రక్షణ రంగంలో 'డ్రోన్ సిటీ'గా ఏపీ



- దొనకొండలో 2,000 ఎకరాల్లో భారీ డీఆర్‌డీఓ కేంద్రం
- రాష్ట్రంలో సెక్యూరిటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ శాండ్‌బాక్స్
- సీఐఐ సదస్సులో హోంమంత్రి అనిత, డాక్టర్ సతీష్‌రెడ్డి వెల్లడి

విశాఖపట్నం, నవంబర్ 12 విశాఖపట్నం : రక్షణ రంగంలో సాంకేతిక ఆవిష్కరణలు, డ్రోన్ల తయారీకి ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా ఎదుగుతోందని సీఐఐ భాగస్వామ్య సదస్సులో వక్తలు పేర్కొన్నారు. దొనకొండలో 2,000 ఎకరాల్లో భారీ డీఆర్‌డీఓ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారు, డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్ డాక్టర్ జి. సతీష్‌రెడ్డి వెల్లడించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో గురువారం నిర్వహించిన 'భద్రత, సాంకేతికత, వృద్ధి' ప్లీనరీలో హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ఆర్థిక వృద్ధి, జాతీయ భద్రత పరస్పర సంబంధం కలిగిన అంశాలని అన్నారు. ఓర్వకల్లులో నిర్మిస్తున్న డ్రోన్ సిటీ పరిశోధన, తయారీ రంగాలకు కేంద్రంగా మారుతుందని తెలిపారు. డ్రోన్లు, యాంటీ డ్రోన్ వ్యవస్థలను పరీక్షించుకునేందుకు రాష్ట్రంలో 'సెక్యూరిటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ శాండ్‌బాక్స్' ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సింగిల్ విండో విధానంలో మూడు నుంచి ఏడు రోజుల్లో అనుమతులు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు 'ఏఐ4ఏపీ', 15 వేల కెమెరాలతో 'సీసీటీవీ 360' వ్యవస్థలను అమలు చేస్తున్నామని అనిత తెలిపారు. మహిళల భద్రతకు విశాఖలో చేపడుతున్న చర్యలను కూడా వివరించారు.

డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ దొనకొండలో ప్రతిపాదిత డీఆర్‌డీఓ కేంద్రంతోపాటు బీడీఎల్, బీఈఎల్, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయని పేర్కొన్నారు. కర్నూలు, జగ్గయ్యపేట ప్రాంతాలు ప్రొపల్షన్, రక్షణ పరికరాల తయారీ కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. విశాఖలో ఆమ్మా ప్రాజెక్టుకు 36 రోజుల్లోనే శంకుస్థాపన ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు.

సమన్వయకర్త, విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా మాట్లాడుతూ ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాలు ఆధునిక యుద్ధాల్లో డ్రోన్ సాంకేతికత ప్రాధాన్యాన్ని చాటాయని అన్నారు. భారత్ పరిశోధనతోపాటు వేగవంతమైన తయారీపై దృష్టి పెట్టాలని సూచించారు. చర్చలో ఎల్‌అండ్‌టీ ప్రతినిధి అరుణ్ రామ్‌చందానీ, బీఏఈ సిస్టమ్స్ ఎండీ టోనీ వాల్టన్, కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ ఛైర్మన్ అరుణ్ రాజేందర్ సింగ్ భాటియా పాల్గొన్నారు. రక్షణ రంగంలో స్టార్టప్‌ల భాగస్వామ్యం, సాంకేతిక ఆవిష్కరణల అవసరంపై అభిప్రాయాలు వెల్లడించారు.

వైజాగ్ నుంచి కజాన్... ఆంధ్రప్రదేశ్-రష్యా భాగస్వామ్యానికి నూతన దిశ

- కీలక ఖనిజాలు, అణుశక్తి, తయారీ, ఓడరేవులు, సాంకేతిక రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు
- పెట్టుబడిదారులకు వేగం, స్థిరత్వం, సేవే ప్రభుత్వ ప్రధాన భరోసా - రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ మంత్రి నారా లోకేష్



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : భారత్-రష్యా మధ్య చిరకాలంగా కొనసాగుతున్న వ్యూహాత్మక స్నేహబంధాన్ని ఆర్థిక, పారిశ్రామిక భాగస్వామ్యంగా మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్-రష్యా మధ్య ప్రాంతీయ భాగస్వామ్యాలను ప్రపంచ స్థాయి అవకాశాలుగా మలచేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా కాన్ఫరెన్స్ హాల్-3 హాల్ లో 'విశాఖ నుంచి కజాన్ వరకు.. ప్రాంతీయ భాగస్వామ్యాల నుంచి ప్రపంచ అవకాశాల దిశగా' అంశంపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మంత్రి నారా లోకేష్ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్, రష్యా ప్రతినిధి బృందానికి స్వాగతం పలుకుతూ, ఆంధ్రప్రదేశ్‌తో రష్యా భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

రష్యాతో తన అనుబంధం సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక సదస్సు పర్యటనతో మరింత బలపడిందని, ఆ సందర్భంగా రష్యాలోని వివిధ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో పాటు ఝఘతీఝఅ ప్రాంత నాయకత్వంతో సమావేశమయ్యే అవకాశం లభించిందని చెప్పారు. అక్కడి పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలు, అభివృద్ధి దృక్పథం తనను ఆకట్టుకున్నాయని తెలిపారు. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నాయకత్వంలో బలపడిన భారత్-రష్యా సంబంధాలను రాష్ట్ర స్థాయిలోనూ మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

కీలక ఖనిజాలు, మెటలర్జీ, తయారీ, చిన్నమాడ్యులర్ అణు రియాక్టర్లు, కృత్రిమ మేధస్సు, పరిశోధన, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి రంగాల్లో పరస్పర సహకారాన్ని విస్తరించవచ్చని మంత్రి నారా లోకేష్ తెలిపారు.

మెటలర్జీ, తయారీ, ఓడరేవుల మౌలిక సదుపాయాలు, సముద్ర రవాణా, ఆర్థిక లావాదేవీలకు అనువైన చెల్లింపు వ్యవస్థలు, బలమైన సరఫరా వ్యవస్థల అభివృద్ధిపై సమావేశంలో చర్చించారు. రష్యాలోని తతారిస్తాన్ ప్రతినిధుల భాగస్వామ్యంతో ఇరు ప్రాంతాల వ్యాపార సంస్థల మధ్య ప్రత్యక్ష అనుసంధానం, సంయుక్త పెట్టుబడులు, మార్కెట్ అవకాశాలను విస్తరించే అంశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం మూడు ప్రధాన భరోసాలను అందిస్తోందని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.

వేగం : పెట్టుబడి ప్రతిపాదనల పరిశీలన నుంచి ప్రాజెక్టుల అమలు వరకు వేగవంతమైన నిర్ణయాలు, సత్వర అనుమతులు

స్థిరత్వం : ప్రభుత్వ విధానాలు, పెట్టుబడి హామీల విషయంలో దీర్ఘకాలిక విశ్వసనీయత

సేవ : పెట్టుబడిదారులకు నిరంతర సహకారం, ప్రాజెక్టుల అమలులో పూర్తి స్థాయి ప్రభుత్వ మద్దతు

పెట్టుబడిదారులకు ఇచ్చిన ప్రోత్సాహకాల హామీలను సకాలంలో అందించేందుకు ఎస్క్రో విధానాన్ని, పెట్టుబడులపై ఇచ్చిన హామీలకు రక్షణ కల్పించేందుకు ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ చట్టాన్ని తీసుకొస్తున్నట్లు వివరించారు. ఈ చర్యలు రాష్ట్రంలో పెట్టుబడులకు మరింత విశ్వసనీయ వాతావరణాన్ని కల్పిస్తాయని తెలిపారు. భారత్--రష్యా చిరకాల స్నేహబంధాన్ని ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా మరింత బలోపేతం చేస్తూ, ప్రాంతీయ భాగస్వామ్యాలను అంతర్జాతీయ పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక సహకారానికి వేదికగా మలచాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు.

భారత్-ఆంధ్రప్రదేశ్‌తో భాగస్వామ్య విస్తరణకు రష్యా పూర్తి మద్దతు!:భారత్‌లో రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్

భారత్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌తోనూ వాణిజ్య, పారిశ్రామిక, సాంకేతిక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు రష్యా పూర్తి ఆసక్తితో ఉందని భారత్‌లో రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ తెలిపారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో రష్యా ప్రతినిధి బృందానికి, తనకు అందించిన ఆత్మీయ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ రష్యా ప్రతినిధి బృందానికి కేటాయించిన సమయం, అందించిన ప్రోత్సాహం, సహకారంపై ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

భారత్-రష్యా మధ్య బలమైన వ్యూహాత్మక సంబంధాలతో పాటు, రష్యాలోని తతారిస్తాన్ సహా వివిధ ప్రాంతాలకు, ఆంధ్రప్రదేశ్‌కు మధ్య ప్రాంతీయ భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు విస్తృత అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఇరు ప్రాంతాల పారిశ్రామిక సంస్థలు, వ్యాపార వర్గాల మధ్య సహకారాన్ని పెంపొందించడం ద్వారా కొత్త పెట్టుబడులు, సంయుక్త ప్రాజెక్టులకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు.

భారత్-రష్యా ఇరు పక్షాలు కలిసి సుమారు 40 కొత్త ప్రాధాన్యతా పెట్టుబడి ప్రాజెక్టులకు మద్దతు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నాయని, తద్వారా 50 బిలియన్ అమెరికన్ డాలర్ల పరస్పర పెట్టుబడుల లక్ష్యాన్ని చేరుకోవాలని భావిస్తున్నట్లు డెనిస్ అలిపోవ్ వెల్లడించారు. నావిగేషన్ వ్యవస్థలు, కృత్రిమ మేధస్సు ఆధారిత విమానాశ్రయ పరిష్కారాలు వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లోనూ పరస్పర సహకారానికి అవకాశాలున్నాయని వివరించారు. భారత్‌లో అణు విద్యుత్ కేంద్ర నిర్మాణంలో భాగస్వామిగా ఉన్న రష్యాకు అణుశక్తి రంగంలో విశేష అనుభవం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉందని తెలిపారు. చిన్న మాడ్యులర్ అణు రియాక్టర్లు (స్మాల్=o), తేలియాడే అణు రియాక్టర్ల వంటి వినూత్న ప్రాజెక్టులను ఇప్పటికే అమలు చేసినట్లు వివరించారు. సురక్షితమైన, పర్యావరణహితమైన అణుశక్తి సాంకేతికత ద్వారా భవిష్యత్తులో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చవచ్చని, ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న భారీ డేటా కేంద్రాలకు అవసరమైన విద్యుత్ సరఫరాలో ఈ సాంకేతికత కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. బ్రహ్మోస్‌తో భారత్--రష్యా మధ్య ఇప్పటికే బలంగా ఉన్న రక్షణ సంబంధాలను మరింత విస్తరించేందుకు అవకాశాలు ఉన్నాయని డెనిస్ అలిపోవ్ తెలిపారు. రక్షణ రంగం ఇరు దేశాల భాగస్వామ్యంలో అత్యంత ఆశాజనకమైన విభాగమని, బ్రహ్మోస్ వంటి సంయుక్త ప్రాజెక్టులు ఈ సహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ రంగంలో పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. భారత్, రష్యా మధ్య అనేక అంశాల్లో ఉమ్మడి ప్రయోజనాలు, సమానమైన అభివృద్ధి దృక్పథం ఉన్నాయని రష్యా రాయబారి తెలిపారు. .

ఆంధ్రప్రదేశ్‌తో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మంత్రి నారా లోకేష్ అందించిన ప్రోత్సాహం, సహకారం స్ఫూర్తినిచ్చాయని పేర్కొంటూ, రాష్ట్రంతో ఆర్థిక, పారిశ్రామిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు రష్యా పూర్తి సంసిద్ధతతో ఉందని భారత్‌లో రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు.

ప్రత్యేక సమావేశంలో జ్లాటా : అంతుషెవా (రష్యా వాణిజ్య ప్రతినిధి బృందం- జీఆర్ డ ఫైనాన్స్ విభాగం లీడ్), లెనార్ జమలీవ్ (తాతరిస్తాన్ రిపబ్లిక్ పెట్టుబడుల అభివృద్ధి సంస్థ డిప్యూటీ హెడ్), ఎకటెరీనా అస్టాషినా (రోసాటమ్ సౌత్ ఏషియా బిజినెస్ డెవలప్ మెంట్ మేనేజర్) తదితరులు పాల్గొన్నారు.

సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

- పెండింగ్ క్రమశిక్షణా కేసులను త్వరగా పరిష్కరించాలి
- ఉద్యోగుల సమస్యలపై కమిషనర్‌కు ఎన్జీజీఓ అసోసియేషన్ వినతి
- క్యాన్సర్ స్క్రీనింగ్, మెగా హెల్త్ క్యాంపునకు కమిషనర్‌కు ఆహ్వానం
- గుంటూరుకు జాతీయస్థాయి గుర్తింపు.. కమిషనర్‌కు ఏపీ ఎన్జీజీఓల అభినందనలు



గుంటూరు, నవంబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్): జాతీయస్థాయిలో గుంటూరు నగరం మూడో ర్యాంకు సాధించి స్వచ్ఛ షహర్ అవార్డును అందుకోవడంతోపాటు గ్రీన్ సిటీగా గుర్తింపు పొందిన సందర్భంగా ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్యాన్సర్ స్క్రీనింగ్, మెగా హెల్త్ క్యాంపునకు కమిషనర్‌ను ఆహ్వానించారు.

అనంతరం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

నస్పెన్షన్‌కు గురైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఏఏఎస్ ద్వారా ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యం నింపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగుల సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, ప్రతి సమస్యను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, గుంటూరు నగర అధ్యక్షుడు చింతల కళ్యాణ్ కుమార్, నగర కార్యదర్శి జీవీ కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్, వెంకట్‌రెడ్డి, సిటీ డీఈసీ సభ్యుడు బెన్హర్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, చాణక్య, మరియల్ తదితరులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌తో మంత్రి లోకేష్ భేటీ



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : విశాఖలో జరుగుతున్న సిఐఐ 31వ పార్టనర్ షిప్ సమ్మిట్ కు హాజరైన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్న ఇన్వెస్టర్ల వివరాలను మంత్రి లోకేష్ డిప్యూటీ సిఎంకు తెలియజేశారు. పెట్టుబడుల రాకకు చొరవ చూపుతున్న మంత్రి లోకేష్ ను పవన్ కళ్యాణ్ అభినందించారు. భవిష్యత్తులో ఇదే ఒరవడిని కొనసాగగలదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

చిన్నారుల్లో న్యుమోనియా నివారణకు 'సాన్స్' ప్రత్యేక ప్రచారం

- ఫిబ్రవరి 28 వరకు అవగాహన కార్యక్రమాలు
- పోస్టర్ విడుదల చేసిన ఆరోగ్యశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు



మంగళగిరి, నవంబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్): ఐదేళ్లలోపు చిన్నారుల్లో న్యుమోనియా నివారణ, శిశు మరణాల తగ్గింపే లక్ష్యంగా చేపట్టిన 'సాన్స్-2026-27' ప్రత్యేక ప్రచార పోస్టర్‌ను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు గురువారం మంగళగిరిలో విడుదల చేశారు. ఈ ప్రచారం 2027 ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందని తెలిపారు. దగ్గు, వేగంగా శ్వాస తీసుకోవడం, ఛాతీ లోపలికి లాగబడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. తల్లిపాలు, టీకాలు, పరిశుభ్రతతో న్యుమోనియా ముప్పును తగ్గించవచ్చని తెలిపారు.

చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ఆర్‌బీఎస్‌కే 2.0 బలోపేతం

53.66 లక్షల మంది చిన్నారుల్లో 30.64 లక్షల మందికి ఆరోగ్య పరీక్షలు

మంగళగిరిలో నిర్వహించిన ఆర్‌బీఎస్‌కే 2.0, ఆర్‌కేఎస్‌కే రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర కార్యక్రమ అధికారి డాక్టర్ వి.వి.బి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చిన్నారులు, కౌమారదశలోని వారికి సమగ్ర ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యమన్నారు. ఆరోగ్య సమస్యలను తొలిదశలో గుర్తించి, అవసరమైన పరీక్షలు, చికిత్సలు, శస్త్రచికిత్సలు అందించేలా కార్యక్రమాన్ని బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రసవ కేంద్రాలు, నవజాత శిశువుల ఇళ్ల సందర్శనల ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్యాధికారులు, పిల్లల వైద్య నిపుణుల సమన్వయంతో సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

నవంబర్ 9 నాటికి రాష్ట్రంలో నమోదైన 53.66 లక్షల మంది చిన్నారుల్లో 30.64 లక్షల మందికి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా, 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 637 శస్త్రచికిత్సలు చేపట్టినట్లు వెల్లడించారు.

జిల్లా బాలల ముందస్తు చికిత్స కేంద్రాల్లో వైద్య సదుపాయాలు, సిబ్బందిని మెరుగుపరచాలని, పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించిన చిన్నారులకు శస్త్రచికిత్సలు త్వరగా నిర్వహించాలని సూచించారు. డిజిటల్ విధానంలో ఆరోగ్య పరీక్షలు, చికిత్సల పురోగతిని పర్యవేక్షిస్తూ అర్హులైన ప్రతి చిన్నారికి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కేంద్రం నుంచి వీజీఎఫ్ సాయం తీసుకోవడం ప్రజాద్రోహమా?

- జగన్ ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి సత్యకుమార్ యాదవ్
- వైద్య కళాశాలల నిర్మాణంలో గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన మంత్రి



అమరావతి, నవంబర్ 12 (జర్నలిస్ట్ ఫైల్): నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్రం నుంచి వైయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) సహాయం పొందడంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ఆరోపణలను వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ అంశంపై నాలుగు పేజీల లేఖ రాస్తూ జగన్‌కు పలు ప్రశ్నలు సంధించారు. వైద్య విద్య విస్తరణకు కేంద్రం నుంచి నిధులు పొందడం ప్రజాద్రోహం ఎలా అవుతుందని ప్రశ్నించారు.

నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు, బాపట్ల, పెనుగొండలో ఐదు వైద్య కళాశాలల నిర్మాణానికి రూ. 3,706.60 కోట్ల అంచనా వ్యయంలో 30 శాతం వాటాగా రూ. 1,091.11 కోట్లు కేంద్రం నుంచి వీజీఎఫ్ రూపంలో అందనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం 17 వైద్య కళాశాలల నిర్మాణానికి రూ. 8,480 కోట్లు అంచనా వేయగా, నాలుగేళ్లలో కేవలం రూ. 1,406.60 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని విమర్శించారు.

మిగిలిన నిర్మాణాలకు రూ. 7,093.40 కోట్లు అవసరమని, ఏడాదికి రూ. 1,000 కోట్లు ఖర్చు చేస్తే పూర్తి కావడానికి కనీసం ఏడేళ్లు పడుతుందని వివరించారు. ఎనిమిది కళాశాలల్లో ఆమోదిత వ్యయంలో 10 శాతం కూడా ఖర్చు చేయలేదని, మరో ఆరు కళాశాలల్లో 11 నుంచి 25 శాతం మధ్య మాత్రమే వ్యయం జరిగిందని పేర్కొన్నారు. పులివెందుల కళాశాలకు మాత్రం రూ. 500 కోట్లలో రూ. 396.16 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు.

2023లో జాతీయ వైద్య కమిషన్ నిబంధనలు మారడంతో వైద్య కళాశాలలకు అనుమతులు పొందేందుకు మౌలిక వసతుల కల్పన తప్పనిసరైందని మంత్రి వివరించారు. మిగిలిన 12 కళాశాలల్లో అవసరమైన ప్రవేశాలకు అనుమతులు పొందాలంటే కూటమి ప్రభుత్వం కేవలం ఏడాదిలోనే రూ. 5,807 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చేదని, అది ఎలా సాధ్యమని జగన్‌ను ప్రశ్నించారు.

గత ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల రూ. 10 లక్షల కోట్లకు పైగా అప్పుల భారం వారసత్వంగా వచ్చిందని, ఆర్థిక వనరులు, నిర్మాణ వ్యయం, నిర్వహణ ఖర్చులను దృష్టిలో పెట్టుకుని తొమ్మిది వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. గతంలోనూ సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానంలో సగం సీట్లకు రూ. 10 లక్షలు, రూ. 20 లక్షల ఫీజులు నిర్ణయించిన జగన్‌కు పీపీపీ విధానాన్ని వ్యతిరేకించే నైతిక హక్కు లేదన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కూడా పీపీపీ విధానంలోనే కొనసాగుతోందని గుర్తుచేస్తూ, వైద్య రంగానికి సంబంధించిన ఏ అంశంపైనైనా జగన్‌తో బహిరంగ చర్చకు సిద్ధమని మంత్రి ప్రకటించారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com